www.vaarthavedhikasurya.com

RNI: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

SCAN ME

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 257 | ఆదివారం | 29, జూన్ 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥




# పీజేఆర్ ఇల్లు.. ఒక జనతా గ్యారేజ్

- పీజేఆర్ పోరాటం వల్లనే నగరానికి కృష్ణా జలాలు
- డిసెంబర్ 9 లోపు విజన్ డాక్యుమెంట్ ను విడుదల
- న్యూయర్,టోక్యో,సింగపూర్ లతో మనం పోటీ పడాలి
- తెలంగాణ పైన ఎందుకు ఈ వివక్ష?
- పీజేఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్28 (వార్త వేదిక సూర్య):** జంట నగరాల్లో 25 ఏళ్ల పాటు పీజేఆర్ శకం నడిచింది. హైదరాబాద్ కు వలస వచ్చిన వారిపై దౌర్జన్యాలు జరిగితే పీజేఆర్ అండగా నిలిచారు. సీఎల్పీ నేత గా పీజేఆర్ పోరాటం అందరికీ తెలుసు. పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్ లా ఉండేది. పీజేఆర్ పోరాటం వల్లనే నగరానికి కృష్ణా జలాలు వచ్చా యి.

నగర ప్రజలు మంచి నీటి అవసరాలు తీరాయంటే అది పీజేఆర్ చలువనే. హైటెక్ సిటీ మహారాష్ట్ర కు తరలి పోకుండా పీజేఆర్ పోరాటం




చేశారు. తెలంగాణ లో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తుంది. హైదరాబాద్కు ఢిల్లీ,చెన్నై,బెంగళూరు,ముంబై పోటీ కాదు. న్యూయర్,టోక్యో,సింగపూర్ లతో మనం

మిగతా 2లో..

# ఆర్థిక సంస్కరణల పితామహుడు

**పివి జయంతి సందర్భంగా సిఎం తదితరుల నివాళి**

- ఆర్థిక సంస్కరణల పితామహుడిగా కొనియాడిన రేవంత్
- నెక్లెస్ రోడ్డు పివి ఘాట్ వద్ద నివాళి అర్పించిన మంత్రులు

**హైదరాబాద్,జూన్28 (వార్త వేదిక సూర్య):** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని

మిగతా 2లో..



# మహా న్యూస్ కార్యాలయంపై దాడి

- కార్లు, ఆఫీసు ధ్వంసం : నిందితుల అరెస్ట్
- మహా న్యూస్పై బీఆర్ఎస్ నేతల దాడి
- వ్యక్తిత్వ హననం, దుష్ప్రచారంపై బీఆర్ఎస్ ఆగ్రహం
- ఆధారాలుంటే ఎందుకు ప్రసారం చేయలేదంటున్న జర్నలిస్టు సంఘాలు

**హైదరాబాద్,జూన్28 (వార్త వేదిక సూర్య):** మహాన్యూస్ చానెల్ కార్యాలయంపై బీఆర్ఎస్ కార్యకర్తలు మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో చానెల్కు చెందిన కార్లు, ఆఫీసు ఫర్నిచర్ ధ్వంసమయింది. దాడిచేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. కాగా ఈ దాడిని అన్ని రాజకీయపార్టీలు, జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో, మహాన్యూస్ కావాలని పనిగట్టుకుని, కేటీఆర్ లక్ష్యంగా చేస్తున్న ప్రచారంపై ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు

మిగతా 2లో..




# తెలుగు రాష్ట్రాల బిజెపి అధ్యక్షుల ఎన్నిక

- నేడు నోటిఫికేషన్..రేపు నామినేషన్
- జూలై 1న అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం

**హైదరాబాద్,జూన్28(వార్త వేదిక సూర్య):** తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకాలకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఒకే రోజు బీజేపీ అధిష్టానం అధ్యక్షులను ప్రకటించనుంది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని

మిగతా 2లో..

# అన్నపూర్ణ క్యాంటీన్ పేరు ఎలా మారుస్తారు?

- జిహెచ్ఎంసి ముందు బిఆర్ఎస్ నేతల ధర్నా
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కార్పోరేటర్లు

**హైదరాబాద్,జూన్28(వార్త వేదిక సూర్య):** అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన

మిగతా 2లో..



# పారిశ్రామిక వేత్తలు వెనక్కి వెళ్లడానికి వీలు లేదు



- ఫ్యూచర్ సిటీ భూ సేకరణ తొందరగా పూర్తి చేయాలి
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- హాజరైన మంత్రి శ్రీధర్ బాబు,సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి.స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్,డైరెక్టర్ ఆఫ్ ఇండ్రస్టీస్ నిఖిల్ చక్రవర్తి,టీజీఐసీసీ వైస్ చైర్మన్ శశాంక

**హైదరాబాద్,జూన్28 (వార్త వేదిక సూర్య):** ఫ్యూచర్ సిటీ భూ సేకరణ తొందరగా పూర్తి చేయాలి. డేటా సెంటర్ల ఏర్పాటు పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.డేటా సెంటర్లు కోసం కావాల్సిన స్థలం సిద్ధం చేయాలి. పెట్టుబడుల కోసం

మిగతా 2లో..



# నన్ను రెచ్చగొట్టొద్దు!

- నేను దేనికి భయపడను
- కడియం శ్రీహరి రాజీనామా చేస్తారో లేదో ఆయనే తేల్చుకోవాలి
- బీసీలను గౌరవించాలని కోరా
- కడియం, రేవూరి, నాయినిపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి
- గాంధీభవన్లో క్రమశిక్షణా కమిటీతో కొండా మురళీ భేటీ

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):** 'నేను బలహీనుడినా బలవంతుడినా అనేది అందరికీ తెలుసు. నన్ను రెచ్చగొట్టొద్దు. నేను రాజీనామా చేసి కాంగ్రెస్ లోకి వచ్చా. కాంగ్రెస్లో చేరిన కడియం శ్రీహరి

మిగతా 2లో..

# ఎక్కడున్నారు ప్రియాంక గాంధీ గారు?

- ఏమైంది నోటిఫికేషన్లు, ఉద్యోగాలు ?
- ఇది దగా క్యాలెండర్.. మెగా డీఎస్సీ దగా డీఎస్సీ!
- దొంగవు నువ్వు.. అబద్దాల ఆడింది నువ్వు ..పిల్లల మీద నెపం వేస్తున్నావు
- తెలంగాణ భవన్లో విద్యార్థులు, నిరుద్యోగులతో భేటీ అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు ...



**హైదరాబాద్(వార్త వేదిక సూర్య):** ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్ నగర్, వివిధ జిల్లాల నుంచి నిరుద్యోగ యువత తెలంగాణ వచ్చి, ఛలో సెక్రెటేరియట్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సీపీఎం కూడా ప్రకటించింది, మీరు కూడా ప్రకటించాలని అడిగారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆనాడు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసే దాకా అసెంబ్లీ లోపల, బయట బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది.

మిగతా 2లో..

# ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కెసిఆర్

**ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోని నాటి పాలకులు**

**జూరాల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ఉత్తమ్**

**గద్వాల,జూన్28(వార్త వేదిక సూర్య):** పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ శాఖని భ్రష్టు పట్టించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్ట్లకు మాజీ సీఎం కేసీఆర్ మెయింటనెన్స్ చేయలేదని మండిపడ్డారు. శనివారం జూరాల ప్రాజెక్ట్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేతలు సందర్శించారు. ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను, 4,8 గేట్స్ ఐరన్ రోప్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్లో కమిషన్లకు కక్కుర్తి పడ్డారని



ఆరోపించారు. భారీ వాహనాలను జూరాలపై నడపటం సేఫ్టీ కాదని ఆనాడే అధికారులు నిర్ధారించారని... కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జూరాల డ్యామ్కు అనుసంధానంగా మరో బ్రిడ్జికి రూ. 100 కోట్లు ఇప్పుడే మంజూరు చేస్తున్నామని ప్రకటించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. భారీ వాహనాల వల్ల జూరాల ప్రాజెక్ట్కు

మిగతా 2లో..



# మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం

**ధర్మపురి,జూన్28(వార్త వేదిక సూర్య):** రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారు ప్రమాదానికి గురైంది. ఆయన ప్రయాణిస్తున్న కారును మరో కారు ఢీకొట్టింది. దీంతో మంత్రి కారు టైరు ఊడిపోయింది. శనివారం సాయంత్రం మెట్పల్లి నుంచి ధర్మపురి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో మంత్రితో పాటు ఎవ్వరికీ ఏమీ కాలేదని తెలుస్తోంది. ఇక, తన కారు టైరు ఊడిపోవంటంతో కార్యకర్త కారులో మంత్రి వెళ్లిపోయారు. ఇదిలావుంటే మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కౌంటర్ ఇచ్చారు. 'నిరుద్యోగులకు బీఆర్ఎస్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో హరీష్ చెప్పగలరా. బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా. ఒక్క ఉద్యోగికి అయినా.. కేసీఆర్ నియామక పత్రం అందించారా. ప్రజలను డైవర్ట్ చేసేలా హరీష్ మాట్లాడు తున్నారు. నిరుద్యోగులను ఏడిపించింది మీరు కాదా. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ పాడు చేసింది. కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేక పోతున్నావా. నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు లేదు. మీ మనుగడ కోసమే ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు' అని అన్నారు.

# పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు..?

- అమిత్ షాకు విషయం చెప్పకుండా ఎంపీ తీసుకువస్తున్నారేమో
- పసుపునకు మద్దతు ధర ప్రకటించాలి
- జగ్గారెడ్డి వ్యాఖ్యలే కాంగ్రెస్ పార్టీ విధానమా ?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,జూన్28 (వార్త వేదిక సూర్య):** నిజామాబాద్ పసుపు బోర్డును ఇదివరకే రెండుసార్లు ప్రారంభించారని.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పుడు మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కూకట్ పల్లి, శేరిలింగంపల్లి, పటాన్ చెరు, యాకుత్ పురా నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు శనివారం కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, పసుపు బోర్డుకు పదే పదే ప్రారంభోత్సవాలు చేయడం కాదు.. ఎన్ డీఏ ప్రభు త్వానికి చిత్తశుద్ధి



ఉంటే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపీ అర్వింద్ కేంద్ర హోం మంత్రికి చెప్పకపోవచ్చని అన్నారు. నిజామాబాద్లోనే పసుపునకు క్వింటాల్కు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించి వెళ్లాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు కాబట్టే మొన్నటి బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటా యించలేదన్నారు. నిజామాబాద్ జిల్లా రైతులు సంతోష పడేలా అమిత్ షా

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY


## పారిశ్రామిక వేత్తలు వెనక్కి వెళ్లడానికి వీలు లేదు

(మొదటి పేజీ తరువాయి)

రాష్టానికి వచ్చే పారిశ్రామిక వేత్తలు ఎవరూ వెనక్కి వెళ్లడానికి వీలు లేదు. నిమ్జ్ లో మిగిలిఉన్న భూ సేకరణ ను తక్షణమే పూర్తి చేయాలి. రైతులతో మాట్లాడి భూములు ఇవ్వడానికి ఒప్పించాలి. ఫ్యూచర్ సిటీ లో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ కోసం అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్చర్స్‌ను నియ మించుకోవాలి. స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ లో క్రికెట్,ఫుట్ బాల్,గోల్ఫ్ వంటి అన్ని క్రీడలు ఉండేలా ప్లాన్ చేయాలి. మెగా ప్రాజెక్ట్స్‌పైన మంత్రి వర్గ ఉప సంఘం ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించి ప్రతిపాదిత ప్రాజెక్ట్స్ పైన చర్చించాలి. 2024లో గ్లోబల్ కెపబులిటీ సెంటర్స్ వచ్చాయి. 2025 లో ఇప్పటికే 25 గ్లోబల్ కెప బులిటీ సెంటర్స్ వచ్చాయి. మరిన్ని సెంటర్స్ వచ్చేలా కృషి చేయాలి. 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకొని అధికారులు పని చేయాలి.

## నన్ను రెచ్చగొట్టొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేస్తారో లేదో ఆయనే తేల్చుకోవాలి. బీసీలను గౌరవించాలని కోరా. నేను దేనికి భయపడను. సీఎం, పీసీసీ అంటే గౌరవం ఉంది. మళ్ళీ అవసరం వచ్చినప్పుడు వరంగల్‌లో మాట్లాడుతా' అని మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటే తనకు గౌరవం ఉందని కొండా మురళి అన్నారు. వైఎస్సార్‌తో కాంగ్రెస్‌పై తనకు అభిమానం పెరిగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనే తపన తనలో ఉంద న్నారు. బహిరంగ విమర్శలు చేయడం మంచిదో చెడునో అంతరాత్మకు తెలుసన్నారు. శనివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణా కమిటీతో కొండా మురళీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 15 పేజీలతో కూడిన నివేదికను కమిటీకి ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ వివరణ కోరిన నేపథ్యంలో 15 పేజీల లేఖను సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డిపై కమిటీకి కొండా ఫిర్యాదు చేశారు . ఉమ్మడి వరంగల్‌లో ప్రతీ నియోజకవర్గంలో జరుగుతున్న అంశాలపై నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం, రేవూరి, నాయినిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కొండా మురళి కోరుతున్నారు.

## పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు..?

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ధరపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు, మహిళలు, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే మహిళలను తక్కువ చేసి కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు కాంగ్రెస్ పార్టీ బతికి బట్ట కట్టింది అంటే అది మహిళల వల్లనే అన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ, సోనియా గాంధీలే నిలబెట్టారని తెలిపారు. మహిళల గురించి జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలే కాంగ్రెస్ పార్టీ విధానమా అని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ను ప్రశ్నించారు. మహిళలను తక్కువ చేసి మాట్లాడుతున్న జగ్గారెడ్డిని ఆయన భార్య, కూతురే సరి దిద్దాలన్నారు. బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లు కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్ లో ఉందని ఆ బిల్లును పాస్ చేస్తారా లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణ జాగృతితో కలిసి పని చేస్తాం : సీపీఐ ఎంపీ సందోష్

తెలంగాణ జాగృతితో సీపీఐ సాంస్కృతిక విభాగం యువ కళావాహిని కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని కేరళకు చెందిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సందోష్ కుమార్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్ లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఆమెతో సందోష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వివిధ దేశాల్లో యువ కళావాహిని జాగృతి కలిసి పని చేస్తాయన్నారు. తన నివాసానికి వచ్చిన సందోష్ ను ఎమ్మెల్సీ కవిత ఘనంగా సత్కరించారు.

### వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

గ్రామ రెవెన్యూ సేవకుల (వీఆర్ఏ) వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వీఆర్ఏ జేఏసీ నాయకులు శనివారం ఎమ్మెల్సీ కవితను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్రంలో 20,555 మంది వీఆర్ఏలు ఉండగా కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 16,758 మందికి వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతుండగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. 61 ఏళ్ల వయసు పైబడిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

## ఆర్థిక సంస్కరణల పితామహుడు

(మొదటి పేజీ తరువాయి)

కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. ఆర్థిక సంస్కరణలతో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు



పంచిందన్నారు. తెలంగాణలో గత పదేళ్లు పాలించిన ప్రభుత్వం ధరణి తెచ్చి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదల హక్కులను కాపాడడానికి భూభారతి చట్టాన్ని తెచ్చామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతం పీవీతోనే సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల బిజెపి అధ్యక్షుల ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

అధిష్ఠానం నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎంపీ పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. పాకా సత్యనారాయణ మాట్లాడుతూ? 'అంతర్గత ప్రజాస్వామ్యం పాటిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఆదివారం అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ జారీ అవుతుంది. 30న ఉదయం 11 నుంచి 1 వరకూ నామినేషన్ స్వీకరణ పక్రియ ఉంటుంది. 30న మధ్యాహ్నం 1 నుంచి 2 వరకూ నామినేషన్ల స్క్రూటిని నిర్వహిస్తారు. సాయంత్రం 4 లోపు ఉపసంహరణకు గడువు. జూలై 1న అధ్యక్ష ప్రకటన, బాధ్యతల స్వీకరణ ఉంటుంది. జాతీయ కౌన్సిల్ పీసీ మోహన్ ఎన్నికల అబ్జర్వర్‌గా ఉంటారని చెప్పారు. అలాగే తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు బీజేపీ పార్టీ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి, కిషన్‌రెడ్డిలు తెలుగు రాష్ట్రాలకు అధ్యక్షులుగా ఉన్నారు. నోటిఫికేషన్‌తో భాజపా సంస్థాగత ఎన్నికల పక్రియ తుది దశకు చేరుకుంది. రెండురాష్ట్రాల్లోనూ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ నుంచి పలువురు పోటీలో ఉన్నారు. డికె అరుణ, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు,రామచంద్రరావులు ప్రధాన పోటీదారులగా ఉన్నారు.

# పీజేఆర్ ఇల్లు.. ఒక జనతా గ్యారేజ్

(మొదటి పేజీ తరువాయి)

పోటీ పడాలి. నగరాభివృద్ధికి కొందరు అవాంతరాలు, అడ్డంకులు సృష్టిస్తున్నారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. కోర్ అర్బన్ రీజియన్, సేమీ అర్బన్ రీజియన్,రూరల్ తెలంగాణ గా విభజించి ముందుకు అడుగులు వేస్తున్నా. ఢిల్లీ నగరం కాలుష్యం కారణంగా నివసించ లేని పరిస్థితిలో ఉంది. చెన్నై లో వరద కష్టాలు,బెంగుళూరు లో ట్రాఫిక్ కష్టాలు ఉన్నాయి. ముంబై,చెన్నై,బెంగళూరు నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. రాజకీయాల ముసుగులో ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకునే వారిని క్షమించ వద్దు. గచ్చిబౌలిలో భూముల్లో ఐటీ కంపెనీలు తీసుకువచ్చి లక్షలాది మంది ఉపాధి కల్పించాలని ప్రయత్నిస్తే అడ్డుకున్నారు. గచ్చిబౌలి భూములపైన న్యాయపో రాటం చేసి సాధించుకుని లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మేం ఆగం.

హైదరాబాద్ లో కాలుష్యం యమపాశంగా మారుతోంది. రాబోయే 100 యేళ్లకు సరిపోయేలా నగరాభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రోడ్ల వెడల్పు, అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్లు నిర్మించబోతున్నాం. డీజిల్ బస్సు ల వల్ల హైదరాబాద్ లో కాలుష్యం పెరుగుతుందని వాటిని జిల్లాలకు తరలించాం. నగరంలోకి 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకు వస్తున్నాం. ఆటో ల కొనుగోలు పైన నిషేధాన్ని తొలగించి ఎలక్ట్రికల్, సీఎన్ జీ ఆటోలకు అనుమతి ఇస్తున్నాం. ఈవీ వెహికల్స్ కు పూర్తి స్థాయిలో పన్ను మినహాయింపు ఇస్తున్నాం. నగరంలో నాలాల కబ్జాల కారణంగా వర్షపు నీరు రోడ్ల పైకి వస్తోంది.

హైడ్రా తో ఆక్రమణలు తొలగిస్తున్నాం. ఎఫ్ టీఎల్ పరిధిలో




ఉన్న ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను ప్రభుత్వం తొలగించింది. హీరో నాగార్జున స్వయంగా ఎన్ కన్వెన్షన్‌కు చెందిన రెండెకరాలు అప్పగించి నగరాభివృద్ధికి సహకరించారు. 40 ఏళ్లుగా బీఆర్ఎస్ నాయకుల ఆక్రమణలో ఉన్న బతుకమ్మ కుంట ను అభివృద్ధి చేస్తున్నాం. డిసెంబర్ 9 లోపు విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేస్తాం. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ప్రపంచం అంతా భారత్ ఫ్యూచర్ సిటీ వైపు చూస్తోంది. 2029 లో శేరిలింగంపల్లి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు విడిపోయే అవకాశం ఉంది. మన్మోహన్ సింగ్, జైపాల్ రెడ్డి వల్ల హైదరాబాద్‌కు మెట్రో వచ్చింది. పీవీ నరసింహారావు వల్ల ఐటీ వచ్చింది. ప్రధాని మోదీ వల్ల హైదరాబాద్ నగరానికి ఇప్పటివరకు ఏం వచ్చిందో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలి. బెంగళూరు, చెన్నై, ఏపీ కి మెట్రో రైల్ ఇచ్చారు.. గుజరాత్ కు బుల్లెట్ ట్రైన్ ఇచ్చారు. గుజరాత్ కు సబర్మతి, ఢిల్లీ కి యమునా, ఉత్తర ప్రదేశ్ కు గంగా ఇచ్చారు..మరి మన మూసీ రివర్ ఫ్రంట్ కు ఎందుకు కేంద్రం నిధులు ఇవ్వడం లేదు? తెలంగాణ పైన ఎందుకు ఈ వివక్ష? అభివృద్ధిలో భేషజాలు లేవు. మీ వెంట వస్తామని స్వయంగా కిషన్ రెడ్డి ఇంటికి వెళ్లి నేను అడిగాను. నగరానికి వస్తున్న అమిత్ షా ను కలిసి మా మెట్రో కు, ట్రిబుల్ ఆర్ కు, మూసీ కి అనుమతులు ఇవ్వాలని కోరతాం. మెట్రోలో తెలంగాణ తొమ్మిదో స్థానానికి దిగజారింది.. ఇది కిషన్ రెడ్డికి కనిపించడం లేదా?

ఎవరు కుట్రలు చేస్తున్నారో, ఎవరు అభివృద్ధి చేస్తున్నారో ప్రజలు గమనించాలి. పీజేఆర్ విగ్రహం ఏర్పాటు కోసం సరైన స్థలాన్ని గుర్తించాలి. పేదలకు అండగా నిలిచిన పీజేఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం మాకు సంతోషం.

# మహా న్యూస్ కార్యాలయంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆ చానెల్‌పై దాడికి దిగాయి.

ఇదే సమయలో.. కేటీఆర్‌కు సంబంధించిన వీడియో, ఆడియో ఆధారాలేమైనా, ఆ చానె ల్ వద్ద ఉంటే దానిని వెంటనే ప్రసారం చేయకుండా.. ప్రోమోలు, పబ్లిసిటీ ఎందుకని పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. "నిజంగా ఆ చానెల్ దగ్గర ఆ మహిళను తన వద్దకు రావాలన్న కేటీఆర్ వీడియో-ఆడియోను వెంటనే టెలికాస్టు చేస్తే బాగుండేది. దానితో ఆ చానెల్ క్రేజ్, వ్యూవర్‌షిప్ కూడా పెరిగేది కదా? అందుకు భిన్నంగా ఏవో ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభిస్తే సహజంగా ఎవరికయినా అనుమానం వస్తుంది.

అందునా ప్రస్తుతం మీడియాలో ఏదైనా సంస్థ-పార్టీలకు నష్టం కలిగే సంఘటనలు జరిగితే.. ముందు వాటిని హైలెట్ చేయటం, తర్వాత రాయబారాలతో దానిని నిలిపివేయడం అంద రూ చూస్తున్నదే. ఈ మధ్య అమరావతిలోని ఒక పెద్ద యూనిర్శిటీ అక్రమ వ్యవహారాలు ప్రింట్ మీడియాలో వెలుగులోకి వచ్చాయి. దానితో ఒక చానెల్.. ఆ యాజమాన్యాన్ని బెదిరించి 2 కోట్లు తీసుకుందన్న ప్రచారం బాహాటంగానే జరుగుతోంది. కాబట్టి ఇక్కడ ఎవ రినీ సమర్ధించేందుకు లేదు. కానీ ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభమైన మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం అనాగరికమ'ని ఓ సీనియర్ జర్నలిస్టు విశ్లేషించారు.

'గతంలో రామానాయుడు మనుమడిని ఓ శృంగార ఘట్టానికి సంబంధించి ఓ జర్నలిస్టు బెదిరించిన వైనం మీడియాయా సర్కిల్స్‌లో అందరికీ తెలిసిందే. ఇలాంటి ఘటనలను ప్రోత్సహించే మీడియా చానెళ్ల యజమానులు కూడా దోషులే.

ఈ రోజుల్లో సాధారణ జర్నలిస్టులు కోట్ల రూపాయలతో సొంతంగా చానెళ్లు ఎలా పెట్టగలుతున్నారు? ఖరీదైన ప్రాంతాల్లో అపార్టుమెంట్లు, విల్లాలు ఎలా కొనగలుగుతున్నారు? అసలు ఆ చానెళ్ల ఆదాయం, రేంజ్ ఆ స్థాయిలో ఉందా? మరి ఆ స్థాయిలో మిగిలిన జర్నలిస్టుల ఆదాయం ఎందుకు పెరగడం లేదన్నది అందరూ ఆలోచించాలి" అని, ఓ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు.

# ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదం ఉందని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున రూ. 100 కోట్లు మరో బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పదేళ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉండి ప్రాజెక్టలను పట్టించుకోకపోవ డంతోనే దెబ్బతింటున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పూడికతీత పనులు కూడా చేపట్టలేదని ధ్వజమెత్తారు. జూరాల ప్రాజెక్ట్ పూడికతీత పనులు వెంటనే చేపడతామని స్పష్టం చేశారు. రూ. 300 కోట్లతో రెండవ గ్యాంటి క్రెన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. నీటిని ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నింపేలా పనులు చేపడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 90శాతం పూర్తయినా నె÷-టటెంపాడు పనులను కూడా కేసీఆర్ ప్రభుత్వం



పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో నెటటెంపాడుకి రూ. 2,753 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. డిసెంబర్ నాటికి వందశాతం పనులు చేసి నెటటెంపాడు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మక్తల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. ఇరిగేషన్ శాఖలో 1100 మంది ఇంజనీర్లను నియమించామని ప్రకటించారు. ప్రతిపక్షాలు సాగు, నీటి ప్రాజెక్టలపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. ఇరిగేషన్ శాఖ అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు ముందుగా రావడంతో జూరాల ప్రాజెక్ట్ పనులు పూర్తి కాలేదని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాల నేతలు ప్రజలను భయాందోళనకు గురి చేశారని చెప్పారు. కాళేశ్వరం కుంగిపోతే ఏమికాదని మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు జూరాలపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ర్ అయ్యారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూసిన.. వారు నమ్మరని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# ఎక్కడున్నారు ప్రియాంక గాంధీ గారు?

మొదటి పేజీ తరువాయి..

విద్యార్థులకు, నిరుద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంది. రాష్ట్రపతి ఉత్తర్వులు సవరించి 95శాతం ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా చేసింది బిఆర్ఎస్, కేసీఆర్. లక్షా 62వేల ఉద్యోగాలు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చింది. నేను వివరాలు విడుదల చేస్తున్నాను.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తున్నది, మేం ఉద్యోగాలు ఇవ్వడం లేదని. మేం గట్టిగా ప్రశ్నిస్తే, రేవంత్ రెడ్డి అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. వెంటనే చర్చ పెట్టకుండా సభ వాయిదా వేసుకొని పారిపోయారు. ఇది జాబ్ క్యాలెండర్ కాదు, జాబ్ లెస్ క్యాలెండర్ అని ఆరోజు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసినం. తెలంగాణ అమరుల స్తూపం ముందు కూర్చొని కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టినం. జాబ్ క్యాలెండర్ లో చెప్పిన నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఎస్పీడీసీఎల్, ఫారెస్ట్, గ్రూప్స్, డీఎస్సీ, పోలీసు ఇలా అన్ని శాఖల్లో పోస్టుల భర్తీ అని జాబ్ క్యాలెండర్ లో చెప్పారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు, ఇది దగా క్యాలెండర్. మెగా డీఎస్సీ దగా డీఎస్సీ అయ్యింది, అసెంబ్లీలో పెట్టి కూడా ఒక్క ఉద్యోగానికి నోటిఫికేషన్ ఇవ్వని చరిత్ర కాంగ్రెస్ ది. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. 20 నెలలు కావొస్తున్నా నోటిఫికేషన్లు లేని పరిస్థితి,.

నోటిఫికేషన్లు వద్దు అని విద్యార్థులు ధర్నా చేస్తున్నరని అబద్దాలు మాట్లాడుతున్నడు రేవంత్ రెడ్డి మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు అని ఫుల్ పేజీ యాడ్స్ ఇచ్చారు. ఓడ దాటినంక ఓడ మల్లన్న ఓడ దాటినంక బోడి మల్లన్న అన్న తీరుగా ఉంది 20 నెలల్లో నువ్వు ఇచ్చిన ఉద్యోగాలు 12వేలు దాటలేదు రేవంత్ రెడ్డి. యువతను దారుణంగా మోసం చేసిండు రేవంత్ రెడ్డి. ఏడాదికి 16వేల ఉద్యోగాలు సగటున మేం ఇస్తే, రెండేళ్లుగా నువ్వు సగం కూడా ఇవ్వలేదు. దొంగవు నువ్వు, అబద్దాల ఆడింది నువ్వు పిల్లల మీద నెపం వేస్తున్నావు.

నోటిఫికేషన్లు ఇవ్వ చేతగాక అబద్దాలు మాట్లాడుతున్నవు

ప్రియాంక గాంధీ గారు సరూర్ నగర్ స్టేడియంలో మీటింగ్ పెట్టి యూత్ డిక్లరేషన్ చేసారు ఇందిరాగాంధీ మనవరాలుగా మాటిస్తున్నాను అని రిలీజ్ చేశారు. ఎక్కడున్నారు ప్రియాంక గాంధీ గారు. ఏమైంది నోటిఫికేషన్లు, ఉద్యోగాలు రేవంత్ రెడ్డిని ఎందుకు ప్రశ్నించడం లేదు ప్రియాంక గారు? మీ కుటుంబం గౌరవం తీస్తున్నడు రేవంత్ రెడ్డి. 5 అంశాల్లోని యూత్ డిక్లరేషన్‌లో ఒక్కటి కూడా అమలు కాలేదుఅమరుల కుటుంబాలకు నెలకు 25వేల పించన్ అన్నారు, రెండు లక్షల ఉద్యోగాలు అన్నరు, అమ్మాయిలకు స్కూటీలు ఇస్తం అన్నరు ఏమైంది? యూత్ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయింది. 75 శాతం ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు మేలు చేసేలా రిజ్వరేషన్ తెస్తం అన్నరు. ఈ మాట దేవుడెరుగు గాని, జీవో 29 రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీలకు నియామకాల్లో దగా చేశారు.

విద్యార్థి భరోసా కార్డు రాలేదు, నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ప్రియాంక గాంధీ ఒక్క హామీ అమలు కాలేదు, రాహుల్ గాంధీ సెంట్రల్ లైబ్రరీ మెట్ల మీద కూర్చొని నిరుద్యోగులకు మాట ఇచ్చారు. 2 లక్షల ఉద్యోగాలు అన్నరు మాట తప్పారు. సోనియా, రాహుల్, ప్రియాంకా అందరూ.. నిరుద్యోగులను మోసం చేసారు. తక్షణం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రేవంత్ రెడ్డి గోబెల్స్ ను మించి పోయి మాట్లాడుతున్నడు. 60వేల ఉద్యోగాలకు సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయి రేవంత్ రెడ్డి. ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చారు? ఎప్పుడు పరీక్ష పెట్టారు? ఎప్పుడు ఫలితాలు ఇచ్చారు వివరాలు వెల్లడించండి.

కోదండరాం, బల్మూరి వెంకట్, ఆకునూరి మురళి, రియాజ్‌లు వచ్చి మభ్యపెట్టారు. మాయ మాటలు చెప్పి విద్యార్థులను రెచ్చ గొట్టారు.

విద్యార్థులకు ఉద్యోగాలు రాలేదు కానీ, రెచ్చగొట్టిన వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ఇప్పుడు వారి దగ్గరికి వెళ్తే బెదిరిస్తున్నరు, కొడుతున్నరు. అక్రమ కేసులు పెడుతున్నరు. ప్రశ్నించిన పిల్లల మీద దాడులు చేస్తున్నారు. నిరుద్యోగులు భయపడకండి. మీరు పోరాడండి మీ వెనుక బిఆర్ఎస్ పార్టీ ఉంటుది. పోరాటం తెలంగాణ రక్తంలోనే ఉంది. మీ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తం, మీకు రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చే దాకా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం. మానుకోట నుంచి వచ్చిన శ్రీధర్ ఫీజు రీయెంబర్స్ మెంట్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

3000 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేస్తం అన్నరు, ఏ ఏడాదికి ఆ ఏడాది ఇస్తం అన్నరు. ఫీజు రీయెంబర్స్ మెంట్ ఒక్క రూపాయి ఇవ్వక కాలేజీలు మూత పడుతున్నాయి. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు మూత పడుతున్నాయి. బడా కాంట్రాక్టర్లకు 12వేల కోట్లు విడుదల చేసావు. పిల్లలు కమిషన్ ఇవ్వడం లేదని ఇవ్వడం లేదా? బిఆర్ఎస్ హయాంలో 20వేల కోట్ల ఫీజు రీయెంబర్స్ మెంట్ ఇచ్చారు. కరోనా వచ్చినా, ఆర్థిక సమస్యలు వచ్చినా కేసీఆర్ ఆపలేదు ఎస్సీలు, బీసీలు, మైనార్టీల పిల్లలు అంటే ఎందుకు అంత చిన్న చూపు విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్నావు రేవంత్ రెడ్డి. తక్షణం ఫీజు రీయెంబర్స్ మెంట్ ఇవ్వాలని, రెండు లక్ష ఉద్యోగాలు ఇవ్వాలని, నాలుగు వేల భృతి ఇవ్వాలని, అమ్మాయిలకు స్కూటీలు ఇవ్వాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ సందర్భంగా హాలో నిరుద్యోగి, చలో సెక్రటేరియట్ పోస్టర్ ను మాజీ మంత్రి ఆవిష్కరించారు.

# అన్నపూర్ణ క్యాంటీన్ పేరు ఎలా మారుస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

దిగారు. శనివారం ఉదయం జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద గులాబీ పార్టీ కార్పొరేటర్లు ధర్నాకు దిగారు. 5 రూపాయలకే పేదల కడుపు నింపే అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చాలనే స్టాండింగ్ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అన్నపూర్ణ క్యాంటీన్లను ఇందిరా క్యాంటీన్లుగా పేరు మార్చే కుట్రను అడ్డుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే బీఆర్ఎస్ కార్యకర్తలను గేటు బయటే పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బల్దియా ప్రధాన కార్యాలయం ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ జంట నగరాలకు ఎంతో మంది వస్తుంటారని.. అలాంటి వారికి కడుపునిండా అన్నం పెట్టాలని అన్నపూర్ణ క్యాంటీన్ల పథకం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నపూర్ణ పేరు మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసిందన్నారు. పేరు మార్చాలని ఉద్దేశం ఉంటే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ప్రజలకు ఇచ్చిందన్నారు. 'ఆరు గ్యారెంటీలకు నచ్చిన పేరు పెట్టుకోండి.. మాకు అభ్యంతరం లేదు. అన్నపూర్ణ పేరు మార్పు మంచి పద్ధతి కాదు' అని మండిపడ్డారు. ఆరోగ్య శ్రీ తెచ్చిన రాజశేఖర్ రెడ్డి పేరే తాము కొనసాగించడం జరిగిందన్నారు. అన్నపూర్ణ అనగానే అమ్మవారు గుర్తుకు వస్తారని.. అన్నపూర్ణ పేరు మార్చాలని ప్రభుత్వానికి ఉద్దేశం ఉంటే కౌన్సిల్ సమావేశంలో చర్చ పెట్టి, ఓటింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం పీజేఆర్ ఫ్లై ఓవర్ ఓపెన్ చేస్తున్నారని.. మరి అది కట్టింది ఎవరని ప్రశ్నించారు. తిమ్మిని బొమ్మను చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అని విమర్శించారు. పేరు మార్పు వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.




## జిహెచ్ఎంసి కార్యాలయంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన

**సికింద్రాబాద్, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** మాజీ మంత్రి సనత్ నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం జిహెచ్ఎంసి కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మారుస్తున్న పేర్ల నేపథ్యంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి



తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేర్లు తప్ప అభివృద్ధిలో శూన్యమని మండిపడ్డారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చాలని ఆరోపించారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అన్నపూర్ణ ఉండగ ఇందిరమ్మ ఎందుకు దండగా, మార్పు అంటే పేర్లు కాదు మార్పు అంటే అభివృద్ధి, ఇంటిపేరు ఎనుముల తీసేసుకో ఇందిరిగా మార్చేసుకో, పేర్లు మార్చడం కాదు ఆరు గ్యారింటల సంగతి ఎంటి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ శ్రీకాంత్, డాక్టర్ హేమ సామల, రాసూరి సునిత, తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి**

**ఎల్ బి నగర్, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):**
హస్తినపురం డివిజన్ పరిధిలోని నందనవనంకు చెందిన శ్రీలత కీళ్లవాపులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వారు నిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు.



వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 1,50,000(ఒక లక్ష యాబై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది. బాధిత భర్త పరంధామ గారికి ఎల్.ఓ.సీ.చెక్కును ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త అనిత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బూత్‌లో "మన్ కీ బాత్" కార్యక్రమం వీక్షించండి

**- గోద పాండుయాదవ్ పిలుపు**



**మైలర్‌దేవ్‌పల్లి, 28 జూన్ (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ప్రజలతో మమేకమయ్యే ప్రసిద్ధ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ ను ఈ నెల 29వ తేదీన ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రతి కార్యకర్త, నాయకుడు తమ తమ బూత్‌లలో వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆకాశవాణి మరియు డిజిటల్ ప్లాట్‌ఫామ్లలో ప్రసారమయ్యే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి దేశ అభివృద్ధిపై తన ఆశయాలు, విధానాలు, విజన్ గురించి పంచుకుంటారని తెలిపారు.
ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని దినచర్యగా అలవర్చుకోవాలని, వీక్షణ అనంతరం సంబంధిత ఫోటోలు, సమాచారాన్ని సోషల్ మీడియా విభాగాలకు మరియు సరళ యాప్‌లో అప్లోడ్ చేయాల్సిందిగా ఆయన సూచించారు.

## బాలల హక్కుల సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన పార లీగల్ సర్వీస్ ప్రతినిధులు...

**మోత్కూరు,జూన్ 28 (వార్త వేదిక సూర్య):** బాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పారా లీగల్ సర్వీస్ ప్రతినిధులు శనివారం నాడు మండలంలో దాచారం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, పాఠశాలలో విద్యార్థులు డ్రాప్ ఔట్, చెడు వ్యసనాలు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని



పరిశీలించారు. అనంతరం పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ సర్వీస్ మండల ప్రతినిధులు కురిమేటి యాదయ్య, ఈ లింగయ్య, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ప్రేమలత, ఉపాధ్యాయులు కుమారస్వామి, వీరేశం, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

# దేశరక్షణకు విద్యార్థులను తీర్చిదిద్దాలి

**గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్**

**స్వామినారాయణ ఇంటర్నేషన్ గురుకుల పాఠశాలలో ఘనంగా ముగిసిన ఇన్వెస్టిచర్**

**మొయినాబాద్, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):**
ప్రస్తుతం ప్రపంచంలో అనేక ఘటనలు జరుగుతున్నాయని అందరి చూపు మనదేశం వైపు చూస్తున్నాయి. భారతదేశాన్ని విశ్వగురువుగా చేసింది దేశ ప్రధాని మోడీ అని చెప్పారు. విద్యార్థులకు విద్యతో పాటు దేశరక్షణలో కూడా పాల్గొనే విధంగా తయారు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు రాజాసింగ్ చెప్పారు. ప్రస్తుతం దేశం అన్ని రంగాల్లో ప్రతిష్టంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లిలో స్వామినారాయణ్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు (ఇన్వెస్టిచర్) పేరుతో రెండు రోజుల పాటు జరిగే పరిచయ కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా హాస్టల్ విభాగానికి చెందిన విద్యార్థులకు ఈ సందర్భంగా నిర్వహకులు ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజాసింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కుల, మత, వర్ణ, భేదాలు



లేకుండా ఎన్నికలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఇంతటి పాఠశాలలు మా ప్రాంతంలో ఉండడం ఎంతో ఆనందదాయకమన్నారు. విద్యార్థి దశ నుండే ఎక్కడ ఎలా మాట్లాడాలో వివరించి చెప్పడమే గాక అట్టాగే శాస్త్ర, సాంకేతిక రంగాలలో విద్యార్థులు పురోగమనం చెందాలని చెప్పాలన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను నిలుపుతూ దేశ సమైక్యతను పెంపొందించే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్న గురుకుల పాఠశాలల యాజమాన్యానికి అభినందనలు తెలుపుతూ.. విద్యార్థులందరూ దేశము మెచ్చె విధం గా తయారుకావాలన్నారు. వివిధ సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న భారతదేశ యువత వైపు ప్రపంచ దేశాలన్ని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయని కొనియాడారు. నైతికంగా నిజాయి తీగా, శరీరకంగా, బలంగా ఆరోగ్యకరంగా ఉండాలని ప్రోత్సహించారు. స్వామినారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలతో కూడిన విద్యను అందించ చడం అభినందనీయన్నారు. ఇక్కడి పాఠశాల ప్రాంగణం, విద్యార్థుల క్రమశిక్షణ ఎంతో బాగుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వామిజీలు హరివల్లబ్ దాస్ గుణప్రియ స్వామిజీ, సద్గురుజీ. సుభ వల్లభ స్వామిజీ హాజరై తమ ఆధ్యాత్మిక సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ హాస్టల్ ప్రిన్సిపాల్ ప్రవీన్కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ శేషుబాబు, విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామినారాయన్ గురుకల్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన స్వామిజీలు రాజానింగ్ కు జ్ఞాపికను అందజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి పటిష్ట చర్యలు

**రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్**

**ఎల్ బి నగర్, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):**
రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్ అన్నారు. శనివారం సరూర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసారు. విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్య నాణ్యత ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో లభించే సౌకర్యాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పాఠశాల ఆవరణను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. గురుకుల పాఠశాలలకు దీటుగా తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తుందన్నారు. నాణ్యమైన విద్య అందించడం కోసం తమ ప్రభుత్వం




ఎంత ఖర్చయినా భరించడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యున్నత మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సారథ్యంలో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు దూరంగా ఉండాలని తద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు మధుసూదన్, శేఖర్ రెడ్డి, నారాయణ, బాలనరేందర్, వెంకటేష్, పద్మ, రోజారమణి, మరియమ్మ, విజయశ్రీ, శోభారాణి, లలిత, భాగ్యమ్మ, రాధ, స్వర్ణలత, అరుణ, డాక్టర్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# మహా న్యూస్ కార్యాలయంపై దాడి దుర్మార్గం!

**ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలి**

**మీడియా స్వేచ్ఛను కాపాడుకుందాం**

**సంగారెడ్డి, 28 జూన్ (వార్త వేదిక సూర్య):**
హైదరాబాదులోని మహా న్యూస్ టీవీ కార్యాలయం పై టిఆర్ఎస్ కార్యకర్తలు జరిపిన దాడిని టియుడబ్ల్యూజెఐజెయు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఉపాధ్యక్షుడు సిద్ధిక్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. తమకు వ్యతిరేకంగా ప్రసారమైన



వార్తలను ఖండించుకునే హక్కు ఎవరికైనా ఉందని అంతేతప్ప పాశవికదాడులకు దిగడం కరెక్ట్ కాదని పేర్కొన్నారు. మీడియా హక్కులకు భంగం కలిగించడంతోపాటు భౌతికతలకు దిగడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. ఫోన్ టాపింగ్ విషయం కావచ్చు ఇతర ఏ అంశమైనా కావచ్చు ప్రజాస్వామ్యంలో చర్చించుకునే హక్కు ఉన్నదని అలాంటప్పుడు దాడులకు దిగడం ఏ రకంగా సమర్ధనీయం కాదని అన్నారు మీడియా కార్యాలయానికి వెళ్లి బెదిరించడం రాళ్లతో రాళ్లతో దాడులకు దిగడాన్ని ఏ ఒక్కరూ కూడా హర్షించబోరని చెప్పారు. గతంలో కూడా మీడియాపై అనేకమంది దాడులకు దిగారని నాడు కూడా తమ సంఘం తీవ్రంగా ఖండించిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఘటన చర్యలు తీసుకోవాలని కోరారు మీడియాపై దాడి చేయాలంటేనే భయం పుట్టే విధంగా చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మీడియా స్వేచ్ఛను కాపాడుకుంటామని ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా నిలబడతామని ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామిక వాదులంతా కూడా ఈ దాడులను ఖండించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# వర్చసా మల్టీనేషనల్‌తో శివరాంపల్లి పాఠశాలకు నూతన వెలుగు

**పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి**

**మైలర్‌దేవ్‌పల్లి,28 జూన్ (వార్త వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో శాశ్వత అభివృద్ధికి పునాదులు పడుతున్నాయి. వర్చసా మల్టీనేషనల్ కంపెనీ తో విద్యాభివృద్ధికి సంబంధించి కీలకమైన అంగీకారం కుదరగా, దాదాపు రూ.3 కోట్ల నిధులు ఈ కార్యక్రమానికి కేటాయించబడ్డాయి.
శనివారం అభివృద్ధి పనుల తొలి విడత ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు . పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజను ప్రారంభించారు. ప్రారంభ విడతలో గ్రౌండ్ లెవెలింగ్,




భవనానికి ఐరన్ గ్రిల్స్ అమరిక, పూర్తిస్థాయి పెయింటింగ్ పనులు జరుగనున్నాయి. అన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సరళమ్మ, ఉపాధ్యాయులు రాజమహేంద్ర రెడ్డి, సుదర్శన్, వెంకటయ్య, నర్సింహాచారి, అంజయ్య తదితరులు హాజరయ్యారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్న దృష్ట్యా, ఈ ఆధునికీకరణతో తాము అందించే విద్యను మరింత నాణ్యతతో అందించగలమని ఉపాధ్యాయులు తెలిపారు. పూర్తి అభివృద్ధి అనంతరం ఈ భవనం కార్పొరేట్ స్థాయి పాఠశాలలను తలపించేలా రూపాంతరం చెందనుంది. ఇది విద్యార్థులకు ఒక ఉత్తమ భవిష్యత్తును అందించే తొలి అడుగుగా నిలిచే అవకాశముందన్నారు.



## పివి నరసింహ రావుగారికి పూలమాల వేసి నివాళులర్పించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**దేవరకొండ,జూన్ 28(వార్త వేదిక సూర్య):**
తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి సభ్యులు, వాణి దేవి, బోగరపు దయనంద్ ,లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహ చార్యులు, పివి కుటుంబ సభ్యులు, సీఎల్పీ సెక్రెటరీ శ్రీకాంత్ అధికారులు.
ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పివి నరసింహ రావు దేశా నికి ఎనలేని సేవ చేశారన్నారు. ప్రధానమంత్రిగా ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, ఆర్థికవేత్తగా దేశాన్ని ముందుకు నడిపించారని ఆయన అన్నారు. పివి గొప్ప మేధావి , బహుభాషా కోవిదుడని ఆయన కొనియాడారు. 14 భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారన్నారు. నిజాయితికి, నిరాడంబరతకు నిలువుటద్దం పివి నరసింహా రావు గారని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.
అలాగే శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి పరిపాలన దక్షకుడు అయిన పివీ నరసింహ రావు గారన్నారు.
దేశానికి ప్రధాని అయిన తెలంగాణ ముద్దు బిడ్డ పివి అన్నారు. ఆయన ఆర్థికవేత్త, సంస్కరణలకర్త గా చరిత్రలో నిలిచారని వివరించారు. ఈరోజు దేశం ఆర్థిక సమస్యలను తట్టుకుని నిలబడుతుంది అంటే దానికి కారణం పివీ గారన్నారు.ఆయన చూపించిన బాటలో మనమందరం పయనించాలని ఆయన సూచించారు.

# జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి**



**నాంపల్లి, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** నల్గొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలో అంగడి బజార్లో జులై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సమ్మె కరపత్రాల ఆవిష్కరణ జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తుందన్నారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్ మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారని అన్నారు. ఈ కోడ్స్ వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కు,సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాల కోసం భేరసారాల హక్కు కోల్పోతారన్నారు. పనిగంటలు విపరీతంగా పెరుగుతాయన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆశ వివోఏ మధ్యాహ్న భోజనం అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని హమాలి ఆటో అసంఘటితరంగా కార్మికులకు కార్మికులకు సంక్షేమ బోర్డు లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు ఆపకపోతే జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె మోడీ ప్రభుత్వానికి ఒక గుణపాఠం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి శంకర్, కాటం స్వామి, సుంకర గణేష్, గుర్రాల మల్లయ్య, పూల శివ, పూల గోపాల్, మహేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు

# పిల్లాయిపల్లి కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలి



**భూదాన్ పోచంపల్లి, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** ప్రభుత్వాలు మారుతున్న పిల్లాయిపల్లి కాల్వ పనుల ను పూర్తి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని , వెంటనే కాల్వపనుల ను పూర్తి చేసి సాగునీటిని అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి లో టై అండ్ డై అసోసియేషన్ ఫంక్షన్ హాల్ లో సిపిఐ మండల 11వ మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టూరిజం పార్కు నుండి టై అండ్ డై అసోసియేషన్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ , జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేట్ పరం చేస్తుందని , దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు,వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

అనంతరం సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన కార్యదర్శిగా గోదల భూషణ్ , సహాయ కార్యదర్శిగా ముసునూరి రాములు , కార్యవర్గ సభ్యుడిగా భీమగోని నరసింహ , సంగం గణేష్ ముషం శివతో పాటు 13 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బొలగాని సత్యనారాయణ, జిల్లా సభ్యులు బోడ సుదర్శన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్ ,ఏ శాల అశోక్, సిపిఐ మండల కార్యదర్శి గోదల భూషణ్ , పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణమూర్తి, నాయకులు పబ్బు యాదయ్య, సుర్కంటి సాయిరెడ్డి, భీమగోని నరసింహ ,ముసునూరి రాములు తదితరులు పాల్గొన్నారు .

# రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

**- రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

**భూదాన్ పోచంపల్లి, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ శాఖ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి వినోబా మందిరంలో భూమి సునీల్ సారధ్యంలో లీగల్ ఎంఫవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీప్స్) ఆధ్వర్యంలో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సాగు న్యాయ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతుల హక్కులు, సాగు చట్టాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 28 నుండి అక్టోబర్ 2 వరకు 800 పైచిలుకు గ్రామాల మీదుగా 2,400 కిలోమీటర్ల పర్యటన సాగుతుందని తెలిపారు . నాణ్యత లేని విత్తనాలు ఎరువులు పురుగుల మందుల వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందని మార్కెట్లో జరిగిన మోసాలకు పంటల భీమ అందనప్పుడు చట్టాలతో రైతులకు అవసరం ఏర్పడుతుందని, చట్టాలను వినియో గించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. దేశంలో 60 శాతం మందికి పైగా జీవనాధారం వ్యవసాయమని రైతులకు సేవలందిస్తే సాగు రక్షించబడుతుందని తెలిపారు. రైతులకు చట్టాలను చుట్టాలు చేయడమే లక్ష్యంగా సాగు న్యాయా యాత్ర చేపట్టామని అన్నారు. విత్తనాలు కొన్నప్పుడు రసీదు తప్పక తీసుకోని భద్రపరచుకోవాలని అన్నారు., నాణ్యమైన విత్తనం రైతు హక్కు అని, నాణ్యతలేని విత్తనాలతో నష్టం జరిగితే పరిహారం పొందవచ్చునని తెలిపారు. విత్తనాల కొనుగోలుకు చెల్లించిన ధర సాగుకైన ఖర్చు తగ్గిన దిగుబడి విలువ కలిగిన మానసిక క్షోభకు పరిహారం పొందవచ్చునని పేర్కొన్నారు. పోచంపల్లిలో జువ్వి చెట్టు కింద






కరపత్రిక పోస్టర్ ను ఆవిష్కరించారు . రైతులకు ఉచితంగా సేవలందిస్తున్న లీప్ సంస్థకు మండల నాయకుడు గోరంటి శ్రీనివాస్ రెడ్డి 50వేల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ మెంబర్ కె వి ఎన్ రెడ్డి, లీప్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భూభారతి సభ్యుడు భూమి సునీల్, భూదాన యజ్ఞ బోర్డ్ మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి , లీప్ సంస్థ ఉపాధ్యక్షులు జీవన్ రెడ్డి , జాయింట్ సెక్రెటరీ అభిలాష్ , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి , జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి , మర్రి నర్సింహారెడ్డి ,పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సుర్వి వెంకటేష్ , మద్ది అంజిరెడ్డి , నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి ,కొట్టం కరుణాకర్ రెడ్డి , తోట శ్రీనివాస్ , పడాల సతీష్ చారి , మహేష్ ,ఏ లే బిక్షపతి , కొయ్యడ నరసింహ, వేషాల మురళి, అంజమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు మూఢ నమ్మకాలు నమ్మొద్దు



**తిమ్మాజీపేట ఎస్సై నరేందర్ రెడ్డి, ఎమ్ ఎన్ ఎస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బైరి అచ్యుత్ రాజ్**

**చేగుంట గ్రామంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

**ఆకట్టుకున్న అచ్యుత్ రాజ్ మ్యాజిక్ ప్రదర్శన**

**ఎమ్ఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు పోలుమూరు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కర్ల నీలకంఠం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ**



**నాగర్ కర్నూల్, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** మూడ నమ్మకాలు నమ్మి ప్రజలు ఆర్థికంగా మానసికంగా నష్టపోవద్దని తిమ్మాజీపేట ఎస్సై నరేందర్ రెడ్డి, మూడ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ బైరీ అచ్యుత్ రాజ్ లు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం చేగుంట గ్రామంలో ఇటీవలి ఒక వ్యక్తి చేతబడి చేశాడనే నెపంతో చెప్పులు వేసి అవమానించిన ఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మూడ నమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్ తమ టీం సహాయంతో ఘటన కు సంబంధించి పూర్తి వివరాలు తెప్పించుకుని పరిశీలించారు ,హా ప్రాంతంలో ప్రజలు ఇంకా మూడ నమ్మకాల వలలో ఉన్నారని గ్రహించి వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించాలని తమ టీం నీ ఆదేశించారు .వెంటనే మూడ నమ్మకాల నిర్మూలన సంఘం నాగర్ కర్నూల్ జిల్లా టీం రంగంలోకి దిగింది. స్థానిక ఎస్సై నీ కలిసి గ్రామంలో జరిగిన ఘటనపై మా సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ,కార్యక్రమానికి పోలీసు శాఖ సహకారం కావాలని కార్యక్రమంలో మీరు ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరగా వెంటనే స్పందించిన ఎస్సై మీ కార్యక్రమానికి పోలీస్ శాఖ సపోర్ట్ ఉంటుందని అలాగే నేను పాల్గొంటానని వారికి హామీ ఇచ్చారు. వెంటనే మూఢనమ్మకాల నిర్మూలన సంఘం బృందం చెగుంట గ్రామానికి చేరుకుని శుక్రవారం రోజు సాయంత్రం గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిఒచారు. మొదటగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు కూడా మూఢనమ్మకాలు నమ్మవద్దని ,వాటి బారిన పడి ఆర్థికంగా మానసికంగా నష్టపోవద్దని సూచించారు. జిల్లాలో ఎక్కడ సంఘటన జరిగిన వెంటనే స్పందిస్తున్న మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం నాయకులను అభినందించారు. అనంతరం మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ బైరి అచ్యుత్ రాజ్ చక్కటి మ్యాజిక్ ప్రదర్శనతో గ్రామస్తులను అలరింపజేశారు. అనంతరం ప్రజల్లో బలంగా నాటుకుపోయిన , భయపెడుతున్న మూఢనమ్మకాలైన రక్తం కక్కడం ,కొబ్బరికాయలో రక్తం, నాలుక వైశూల్యాన్ని కుచ్చుకోవడం . కాగితంపై దయ్యం ఆనవాళ్లు కనబడేలా చేయడం , తదితర వంటి వాటిని లైవ్లో ప్రదర్శించి వాటి వెనుకున్న రహస్యాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి సామాన్య మనిషి అని ఒక మనిషి దగ్గర ఇంకో దగ్గర లేని అతితెశక్తులు ఏమీ లేవని ప్రతి ఒక్కరు గ్రహించాలని అన్నారు. మూఢనమ్మకాల పేరిట జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. సైన్స్ రోజురోజుకు అభివృద్ధి చెందుతుంటే ప్రజలు మూఢనమ్మకాల బారిన పడుతూ ఉండడం చాలా బాధాకరమని అన్నారు. మీ ప్రాంతాల్లో ఎలాంటి మూఢనమ్మకాల ఘటన జరిగిన మా సంఘం తరఫున అవగాహన కల్పించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు పోలుమూరు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కర్ల నీలకంఠం, సంయుక్త కార్యదర్శి కటీకం రమేష్ గౌడ్, గ్రామ పెద్దలు గాలి రాజు ,వెంకటరెడ్డి, శ్రీశైలం ,వినోద్ కుమార్ ,స్వామి, గాలి వెంకటయ్య, ఏం ఎన్ ఎస్ మండల అధ్యక్షుడు వంశీ,నాయకులు గుండ్ల శంకర్ సంకి రాములు, విజయ్ , గ్రామస్తులు పరిసర ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలి



**వలిగొండ, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** ప్రభుత్వం ఇండ్లు లేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో జరిగిన అవక తవకలపై విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంపిడిఓ జితేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కమిటీలు రద్దుచేయాలని, గ్రామసభల ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలని అన్నారు. గత 10 సంవత్సరాలుగా ఇండ్లు మంజూరు చేయక గ్రామాలలో ఇండ్లు లేని నిరు పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం పేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ పార్టీ పథకాలుగా మార్చి కార్యకర్తలకే మంజూరు చేసి పేద ప్రజలను విస్మరించారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు వెంటనే స్పందించి వాస్తవంగా ఇళు లేని పేదలను గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇల్లు నిర్మించుకోవాలని అధికారుల ఒత్తిడికి కొంత మంది ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా లేరని వారి స్థానంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దెల రాజయ్య,సిర్పంగి స్వామీ, తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కందడి సత్తిరెడ్డి, గాజుల ఆంజనేయులు, చీర్క శ్రీశైలం రెడ్డి, కవిడే సురేష్, బూడిద మనమ్మ,దొడ్డి బిక్షపతి,రాధారపు మల్లేశం,రుద్రపల్లి రామలింగం,గర్దాసు నరసింహ తదితరులు పాల్గొన్నారు.






## మాజీ ప్రధాని పి.వి నర్సింహారావు జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి నివాసంలో పాల్గొన్న ఎమ్మెల్యే సామేల్

**మోత్కూరు, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతి మాజీ ప్రధాని పి.వి.నర్సింహారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. శనివారం నాడు ఆయన జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసం లో జరిగిన ఆయన జయంతి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, పర్యాటక కార్పోరేషన్ ఛైర్మన్ రమేష్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నట్లు సామేల్ తెలిపారు ఈ సందర్భంగా సామేల్ మాట్లాడుతూ భారత ప్రధాని ప్రజల కోసం ఎన్నో సంస్కరణలు తీసుక వచ్చిన బహుజన బిడ్డ పి.వి.నర్సింహా రావు అని ఆయన సేవలను కొనియాడారు.

## మృతుని కుటుంబానికి సిపిఎం ఆర్థిక సహకారం

**రామన్నపేట,జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతి పరుడు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుడు బొడ్డుపల్లి మల్లేష్ అనారోగ్యంతో మరణించగా శనివారం సిపిఎం గ్రామ



శాఖ ఆధ్వర్యంలో కుటుంబానికి రూ.20,000/- ఆర్థిక సహకారం చేసి అండగా నిలిచింది. పేద కుటుంబామైన మల్లేష్ చిన్న వయసులోనే మరణించడం విచార కరమణి కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్ నాయకులు దోమలపల్లి నర్సింహా,కంకల శేఖర్, కునూరు గణేష్,మోటే స్వామి,సిలువేరు రాజు,గుంజె సైదులు,వర్కాల నాగరాజు,సిలువేరు వెంకటయ్య, మొగిలి ముత్యాలు,బొడ్డుపల్లి రాము, శివరాత్రి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## అరెగూడెం పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక

**మోత్కూరు, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ఉన్న కామా దేనువు బాల ఉత్పత్తి దారుల సహకార సంఘం చైర్మన్గా బద్ధం స్వామి రెడ్డి ఏకగ్రీవంగా



ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టి మధుసూదన్ చారి ఒక శనివారం నాడు ప్రక టనలో తెలిపారు.. డైరెక్టర్లు గా మాసుక వెంకటరెడ్డి, కొణతం లింగారెడ్డి, జక్క మధుసూదన్, దేవరపల్లి విద్యాసాగర్, కన్నెబోయిన పరమేష్ , గజ్జి మల్లేష్, జిట్ట నరేష్, నల్ల ఆబియ, జిట్టా యాదమ్మలు ఎన్నికైయ్యారని చెప్పారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని స్థానికులు శాలువాలతో సన్మానించారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట

**తేదీ : 28/06/2025, శనివారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 29,35,688/-**

**శ్రీ స్వామి వారికి 1200 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 60,000/- |
| ప్రధాన బుకింగ్ | - | 1,23,850/- |
| కైంకర్యములు | - | 2,001/- |
| సుప్రభాతం. | - | 12,100/- |
| బ్రేక్ దర్శనం. | - | 2,02,200/- |
| వ్రతాలు | - | 98,400/- |
| వాహన పూజలు | - | 19,400/- |
| VIP దర్శనం | - | 3,75,000/- |
| ప్రచారశాఖ | - | 19,275/- |
| పాతగుట్ట | - | 19,200/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 5,17,500/- |
| యాదఋషి నిలయం | - | 80,900/- |
| సువర్ణ పుష్పార్చన | - | 59,600/- |
| శివాలయం | - | 8,200/- |
| శాశ్వత పూజలు | - | 1,01,000/- |
| పుష్కరణి | - | 950/- |
| ప్రసాదవిక్రయం | - | 10,07,160/- |
| లాకర్స్ | - | 200/- |
| అన్నదానం | - | 2,23,013/- |
| విమాన గోపురం | - | Nill |
| లీజెస్ | - | Nill |
| ఇతరములు | - | 5,739/- |









## అవగాహన లోపంతోనే ఫిర్యాదు చేశాం

**వలిగొండ, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** అవగాహన లోపంతోనే మొగిలిపాక ఏఈఓ సాయి పైన జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన చలిచీమల లక్ష్మమ్మ తెలిపారు. రైతు బంధు తమకు పడలేదని బ్యాంక్ అధికారులు తెలపడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని, శనివారం బ్యాంకు లో ఈకేవైసీ చేయనందువలన రైతుబంధు డబ్బులు పడలేదని బ్యాంకు అధికారులు తెలిపారని ఆమె అన్నారు. ఈకేవైసీ పూర్తి అయిన తర్వాత ఈ నెల 16వ తేదీన తనకు రైతుబంధు డబ్బులు పడ్డాయని బ్యాంకు అధికారులు తెలిపారని, తనకు అవగాహన లోపం వలన ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని వాటర్ టాంక్ ఎక్కి నిరసన తెలిపిన యువకుడు

**వలిగొండ, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో ఆ గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు బొడ్డు మత్స్యగిరి ప్రభుత్వం నుండి తనకు ఇల్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు మంజూరు చేయలేదనే మనస్తాపంతో శనివారం వాటర్ టాంక్ ఎక్కి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై యూగందర్ ఆ గ్రామానికి వెళ్లి అధికారులతో మాట్లాడి తనకు ఇల్లు మంజూరు చేయిస్తానని గ్రామస్థులను బాధితున్ని సముదాయించి టాంక్ పైనుండి యువకున్ని కిందకు దించివేసి సమస్య పరిష్కరిస్తానని వారికి తెలిపారు.



## ఘనంగా వెల్కమ్ ఫ్రెషర్స్ డే

**భూదాన్ పోచంపల్లి, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో వెల్కమ్ ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు . విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహం ఉల్లాసంగా గడిపారు . ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చైర్మన్ వంగూరి పాండు, ప్రిన్సిపల్ విశ్వనాథం, ఇన్చార్జ్ డైరెక్టర్ వంగూరి స్వాతి , ఉపాధ్యాయులు గౌస్ పాషా, లావణ్య, నవీన్, సంధ్యారాణి , పి ఈ టి నవీన్ , తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

### బీజేవైఎం అధ్యక్షులు నాంపల్లి సతీష్


**నాంపల్లి, జూన్ 28(వార్త వేదిక సూర్య):** నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృత్తి విద్య శిక్షణ నైపుణ్య కళాశాల ఏర్పాటు



చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి బిజెవైఎం మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ శనివారం వినతి పత్రం అందజేశారు డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నంత ఉన్నత విద్యకు దూరమైతున్నారని తెలిపారు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

## రాష్ట్ర ఎక్సైజ్ , టూరిజం శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటేశ్వర్లు

**మోత్కూరు, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శనివారం, నాడు మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు తెలిపారు.. శనివారం నాడు మోత్కూరు విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై ప్రస్తావించగా మంత్రి సానుకూలంగా స్పందించారని వెంకటేశ్వర్లు తెలిపారు.



## లోతుకుంట సురేష్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందచేత

**మోత్కూరు, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మండలం పనకబండ గ్రామానికి చెందిన లోతుకుంట సురేష్ ఇటివల అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్ ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన సురేష్ అదే గ్రామానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం కు తెలియపర్చగా ఆయన చొరవతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య సహకారంతో కేంద్ర మంత్రి వర్యులు జి.కిషన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిది కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి శనివారం నాడు మంజూరు అయ్యింది .ఈ మంజూరైన 15000 వేల రూపాయలు చెక్కును శనివారం బీజేపీ క్యాంప్ కార్యాలయం ( హైదరాబాద్ ) లో కడియం రామచంద్రయ్య గారి చేతుల మీదుగా చెక్కును సురేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిషన్ మోర్చా కార్యవర్గ సభ్యులు దండ శ్రీనివాస్ రెడ్డి , జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, బీజేపీ మోత్కూరు మండల అద్యక్షులు గూదే మధుసూదన్ యాదవ్, మండల నాయకులు వల్లపు మల్లేష్ యాదవ్, జినుకల నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## జానపద వృత్తి కళాకారుల ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### బిబిపి.ఎన్.ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు

**మోత్కూరు, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని ప్రజానాట్యమండలి .(పి.ఎన్.ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు అన్నారు. శనివారం నాడు మోత్కూరు మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ప్రజానాట్యమండలి మొదటి మండల మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ముత్యాలు, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన నెలకు 5వేల,రూపాయలు పెన్షన్ , ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్




చేశారు. జిల్లాలో ఉన్న జానపద వృత్తి కళాకారులైనటువంటి సిందు, యక్షగానం, కోలాటం, బాగోతం, భజన కళాకారులకు, ప్రభుత్వం గుర్తించి కళాకారులకు గుర్తింపు కార్డులను జూలై నెలాఖరు వరకు ఇవ్వాలని కోరారు.లేనియెడల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు కాలుకు గజ్జ కట్టి చేత డప్పు పట్టి భుజాన గొంగడి వేసి పాలకుల విధానాలను ఆటపాటల ద్వారా కళాకారులను సమీకరించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని ముత్యాలు హెచ్చరించారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, జానపద కళాకారులు పిట్టల మత్స్య గిరి,ముక్కాముల ఉమేష్, దుడ్డు అలీకుమార్, చందు,రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## మోరీ తీశారు... స్లాబ్ మరిచారు...

### అధికారుల తీరుపై ప్రజలు అసహనం

**మోత్కూరు, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 2వ, వార్డులో శ్రీరామలింగే శ్వర స్వామి ఆలయ పరిధిలోని డ్రైనేజీ కోసం మోరీని తీశారు.. స్లాబ్ వేయడం మర్చిపోవడంతో ఆ కాలనీ ప్రజలు మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోని ప్రధాన రహదారి వెంట మోరీలు నిర్మాణం జరుగుతుంది. ఈ మోరీలకు వర్షపు నీరు మురుగు నీరు మోరీలు చేరి తద్వారా భిక్కేరు వాగులో కలపడానికి అధికారులు ప్రయత్నించడం మంచిదే కానీ.. ఆ మోరీ పైన స్లాబ్ వేయలేమని కాంట్రాక్టర్, అధికారుల తీరుపై శనివారం నాడు కాలనీవాసులు మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కాలనీలో నివసిస్తున్న చిన్నపిల్లలు, ఇక్కడి నుంచి వెళ్లే వాహనదారులకు, అందులో పడి, ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా ఒక దశలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు కాలనీకి వెళ్ళి మోరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మోరీలపై స్లాబ్ వేసి ఇక్కడ ప్రజలకు ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆ కాలనీవాసులు కూసంపల్లి సోమ నరసయ్య, మహమ్మద్ వహీద్, మన్నె కరుణాకర్, మైబెల్లి , చంద్రమౌళి పాల్గొన్నారు.





## భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డిస్పోజల్ చేయాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**యాదాద్రి భువనగిరి/కలెక్టరేట్/జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డిస్పోజల్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు.శనివారం రోజు భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ... భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తును భూ భారతి లో నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు నోటీసు జారీ చేసి విచారణ చేసిన అనంతరం భూ సమస్య దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించి ఫైల్ ఎప్పటికపుడు డిస్పోజ్ చేయాలన్నారు.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ , భూ సంబంధిత సమస్యలు మార్పులు, చేర్పులు పాత రికార్డుల ఆధారంగానే పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.






## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యేను కోరిన సిపిఐ శ్రేణులు

### యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

**మోటకొండూర్, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలని, సి పి ఐ శ్రేణులకు ప్రత్యేక కోటా కేటాయించి నిర్మాణానికి సహకరించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో సి పి ఐ శ్రేణులు కోరారు. శనివారం యాదగిరిగుట్ట నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి అంచెలంచెలుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసి పని చేసి అధిక స్థానాలు గెలిపించాలని తెలిపారు.

ఈ కార్యక్రమం లో సిపిఐ మోటకొండూర్ మండల కార్యదర్శి గాదెగాని మానిక్యం సి పి ఐ కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, పల్లే వెంకన్న, నల్ల రాములు, నాయకులు బోలగాని అశోక్, మారబోయిన ఇమ్మేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించాలి

### - సైకాలజీ మోటివేటర్ బైరి అచ్చుత్ రాజ్

**సిద్దిపేట,జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైకాలజీ మోటివేటర్ అచ్చుత్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో ఉండాలని, క్రమశిక్షనే మన రక్షణ అని తెలిపారు.టీచర్లను ప్రతి విద్యార్థి గౌరవించాలని,పుస్తకాలు చదవాలని పుస్తకాలు మనల్ని జ్ఞానం వైపు నడిపిస్తాయని,విద్యార్థి దశలోనే చాలా మంది అబ్బాయిలు మత్తుపానియాలకు బానిసలు అవుతున్నారు అలా కావద్దని,బైక్ పై స్పీడ్ గా వెలుతూ ప్రాణాలు కోల్పోతున్నారు అలాగే బైక్ సైలెన్సర్ లను తీసివేసి ఎక్కువ శబ్దంతో రోడ్డుపై వెలుతూ ప్రజలని ఇబ్బందిపెడుతున్నారు కొంత మంది విద్యార్థులు భవిష్యత్తులో అలా చేయకూడ దని, తల్లిదండ్రులతో ప్రేమగా ఉండి వారి ప్రేమను పొందాలని,వారి కష్టాన్ని అర్థం చేసుకోవాలని,సెల్ ఫోన్ ఎక్కువగా వాడకూడదని, టీచర్ చెప్పిన జ్ఞానాన్ని విద్యార్థులు తమ మెదడులో పదిల పరుచు కోవాలి అని తెలిపారు అలాగే పలు సైకాలజీ స్టోరీస్‌తో చక్కగా వివరించారు.ఈ కార్యక్రమంలో (ఎమ్ఎన్ఎస్) మూఢనమ్మకాల నిర్మూలన సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నర్రా కళాధర్ ,పాఠశాల ఉపాధ్యాయులు అనురాధ ,ఎల్లయ్య ,పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY







## క్రీ.శే. శ్రీమతి హన్మంతు పెద్దమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్ పిసిసి సభ్యులు జాలే నరసింహారెడ్డి

**దేవరకొండ, 28 జూన్ (వార్త వేదిక సూర్య):** శనివారం నాడు దేవరకొండ పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ హన్మంతు చంద్రన్న గారి సతీమణి హన్మంతు పెద్దమ్మ గారి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పిసిసి సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ జాలేనరసింహారెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి, ఇప్ప ప్రవీణ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, తిరుపతయ్య, బాలు, అంజి, మహేష్, మరియు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## మంత్రి వివేక్ వెంకటస్వామినీ కలిసిన మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి



**దేవరకొండ, జూన్ 28 (వార్త వేదిక సూర్య):** శనివారం హైదరాబాదు సోమాజిగూడ లో తెలంగాణ రాష్ట్ర మైనింగ్ ,కార్మిక శాఖ మంత్రి బడుగు బలహీన వర్గాల ప్రదాత గడ్డం వివేక్ వెంకటస్వామి నీ తన నివాసంలో దేవరకొండ నియోజకవర్గం మాల మహానాడు అధ్యక్షులు బోయిని చంద్రమౌళి మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## కళలను ప్రోత్సహిస్తున్న ఆర్ కె సేవా ఫౌండేషన్

**దేవరకొండ, జూన్ 28(వార్త వేదిక సూర్య):** దేవరకొండ లో శనివారం రోజు జరిగిన నాయిదొరా జానపద నృత్య షూటింగ్ ప్రారంభం కార్యక్రమంలో ఆర్.కె సేవా ఫౌండేషన్ ముహూర్తం షాట్ ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ కె సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామకృష్ణ మాట్లాడుతూ మల్టి టాలెంట్ అవార్డు గ్రహీత ఈ యొక్క సాంగ్ హీరో అయినా ముషిని



అంజి ని అభినందిస్తూ వారు దేవరకొండ తెస్తున్న కీర్తి ప్రతిష్ట చేస్తున్న సేవలు చాలా అభినందనియమని, వారు చేస్తున్న ఈ సాంగ్ ఎన్నో అవార్డ్స్ పొందుకోవాలని మంచి పేరు తెచ్చి పెట్టాలని కొనియాడడం జరిగింది, డాన్సర్ కళ్యాణి మరియు కొరియగ్రాపర్ మాస్టర్ జగన్ కు మంచి గుర్తింపురావాలని డాన్స్ యూనిట్ కు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు చిత్తనూరు మాస్టర్ శ్రీను, ప్రధాన కార్యదర్శి పొట్ట విజయ్ కుమార్, మాకబుల్,గుండాల వెంకట్ యాదవ్, టోంగర్ ప్రతాప్, మరియు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## దోనియాల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన

**దేవరకొండ, జూన్ 28(వార్తా వేదిక సూర్య):** కొండమల్లేపల్లి మండల పరిధిలోని దోనియాల గ్రామంలో శనివారం నాడు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి



గారు దోనియాల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణా పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మాజీ జెడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగేందర్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ కాసార్ల వెంకటేశ్వర్లు, కొండమల్లేపల్లి మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, గ్రామ నాయకులు జితేందర్ యాదవ్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంగ్య నాయక్ దోన్యాల గ్రామాల లబ్దిదారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# డాక్టర్ల బృందాన్ని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

- నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించడం సంతోషం
- నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన వైద్య సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ, జూన్ 28 (వార్తా వేదిక సూర్య):** వృత్తిపరంగా ఎన్నో ఒత్తిడిలు ఉన్నప్పటికీ వైద్య వృత్తిలో ఉంటూ పేద ప్రజలకు వైద్య సేవలందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాకుండా, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు ధీటుగా నల్గొండ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి డాక్టర్లు అరుదైన శస్త్ర చికిత్సలు చేయడం పట్ల ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్లను అభినందించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడం డాక్టర్ల బాధ్యత అయినప్పటికీ వారు చేస్తున్న సేవలు అమోఘమని, అందుకుగాను వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇటీవల ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో ఒక డాక్టర్ల బృందం మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా , నిర్వహించగా మరో డాక్టర్ల బృందం 60 సంవత్సరాల వయసు కలిగిన మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించి సుమారు 6 కిలోల కణతిని తొలగించడం జరిగింది. ఇందుకుగాను శనివారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన డాక్టర్ల బృందంలోని డాక్టర్లు శ్రీకాంత్, నిఖిత, దివ్య, అనస్తేసియా డాక్టర్లు డాక్టర్ బద్రి నారాయణ, పరమేశ్వరి,సుధ, గిరి లను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి రెండింటిని పటిష్టం చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా వృద్ధిలోకి రావాలని అన్నారు. సహాయ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నగేష్ మాట్లాడుతూ నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వైద్యులకు, అలాగే నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల బోధన, బోధనేతర సిబ్బందికి జిల్లా కలెక్టర్ అందిస్తున్న ప్రోత్సాహానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ ఫ్యాకల్టీతో పాటు, అన్ని రకాల సౌకర్యాలు, వైద్యపరమైన జాగ్రత్తలు, సేవలు అన్ని బాగున్నాయని ,అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి మహిళ కడుపులో నుంచి 6 కిలోల కణతిని తొలగించిన డాక్టర్ల బృంధాన్ని ఆయన అభినందించారు.

శస్త్ర చికిత్స నిర్వహించిన డాక్టర్లు శ్రీకాంత్,అనస్తేసియా డాక్టర్ బద్రి నారాయణ లు మాట్లాడుతూ శస్త్ర నిర్వహించిన రోగి వివరాలు,సహకరించిన డాక్టర్లు,అనస్తేసియా బృందం తదితర వివరాలను వెల్లడించారు. అంతకుముందు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ గదిలో నిర్వహించిన ప్రభుత్వ వైద్య కళాశాల మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటుచేసే మౌలిక సదుపాయాలు, అకాడమిక్ సౌకర్యాలు, భవనాలు, లెక్చర్ హాల్స్, లైబ్రరీ, లేబరేటరీ, విద్యార్థుల సంక్షేమం ,హాస్టల్ తదితర విషయాలపై సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు కాకుండా అత్యవసరమైన వాటికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వైద్య కళాశాలలో నూతనంగా నిర్మించిన మ్యూజియం, ఇండోర్ గేమ్స్ హాల్, డిస్సెక్షన్ హాల్, డైనింగ్ హాల్ లను పరిశీలించారు. ఆ తర్వాత మెడికల్ కళాశాల పక్కనే ఉన్న స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికై స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆ పక్కనే ఉన్న ఎస్ఎల్బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను తనిఖీ చేసి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా బాగా చదువుకోవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న టీచింగ్ హాస్పిటల్ నిర్మాణాన్ని తనిఖీ చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ,సాధ్యమైనంత త్వరగా ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకువచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ సహాయ డైరెక్టర్ డాక్టర్ నగేష్ తో పాటు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాని,ప్రభుత్వ ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృనాయక్ , ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ వినీల రాణి,రామచంద్ర, టి ఎస్ ఎం ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అజీజ్, డాక్టర్లు వందన, స్వరూప రాణి, తదితరులు ఉన్నారు .

# అక్రమ వడ్డీ వ్యాపారస్తుల పట్ల జిల్లా ప్రజలు జాగ్రత్త

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్**

**నల్లగొండ,జూన్ 28(వార్త వేదిక సూర్య):** జిల్లాలో రైతులను, అమాయక ప్రజలను టార్గెట్ చేసుకొని కొందరు మోసగాళ్లు షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు అంటూ అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అధిక వడ్డీ ఆశకు పోతే అసలుకే ఎసరు అవుతుందని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎవరైనా అమాయక ప్రజలను, రైతులను అధిక వడ్డీ ఇస్తామని మభ్యపెట్టీ వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో కొంత మంది ప్రజలు ఇండ్ల భూములు, వ్యవసాయ భూములు, మరియు బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చి మరి అక్రమ వ్యాపారాలకు అధిక వడ్డీ ఆశకు డబ్బులు ఇస్తున్నారని వారు మొదటగా కొంత మొత్తంలో ఇస్తూ ఆశ చూపించి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వగానే మోసాలకు గురి చేస్తారని అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా



ఉండాలని అన్నారు. సొంత చుట్టాలు,చుట్టూ పక్కన వాళ్ళను ఎంచుకొని మన మధ్యలో ఉంటూ ఎక్కడికి వెళ్ళడు మనవాడిలా నమ్మిస్తూ వ్యాపారాలు చేస్తున్నారు.అలాంటి వారి స్తోమతను గమనించి పెట్టుబడి పెట్టాలని సూచించారు.ఎవరైనా ఫైనాన్స్ వ్యాపారాలు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ అధిక వడ్డీలను వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా నేరం అని తెలియజేస్తూ, వడ్డీకి డబ్బులు ఇచ్చి దానికి బదులుగా భూమిని తమ పేర్లపై సేల్ డీడ్లను చేసుకోవడం చట్టరీత్యా నేరం అని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో సైబర్ నేరాల పట్ల అనేక అవగాహన సదస్సులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అధిక వడ్డీలు వసూలు చేసిన, అధిక వడ్డీలు ఇస్తామని మభ్యపెట్టీ డబ్బులు వసూలు చేసిన అలాంటి వారి సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలనీ కోరారు.

# చింతకుంట్ల మాదిగ వాడల్లో ఇందిరమ్మ ఇళ్ల పంపిణిలో మాదిగలకు తీరని అన్యాయం

**దేవరకొండ, జూన్ 28(వార్తా వేదిక సూర్య):** కొండమల్లేపల్లి మండలం పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో మాదిగ వాడలో 400 మంది ఓటర్లు ఉన్న ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు రాలేదు . దాని కారణం మండల స్థాయి విబేధాలే కారణం నాయకత్వంలో నలిగిపోతున్న చింతకుంట్ల మాదిగ వాడ ఎన్నికలు రాంగనే గద్దలాలినట్టుగా మాదిగ వాడ పై ఎల్లలేని ప్రేమ చూపుతూ మీకు అండదండగా ఉంటాం అన్ని మాయమాటలు చెప్పి ఎన్నికలు అయిన తర్వాత పట్టించుకున్న నాధుడే లేడు సీసీ రోడ్లు ఇందిరమ్మ ఇండ్లు గాని ఇవ్వకుండా గద్దొచ్చి కోడి పిల్లను ఏసుకో పోయినట్టుగా వేరే గూడానికి తరలి పోయినాయి ఇందిరమ్మ ఇల్లు ఇల్లు అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా చింతకుంట్ల మాదిగ వాడ పై చిన్నచూపు ఎందుకు అని ఎమ్మార్పీఎస్ కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు ఎదుల ఎల్లయ్య అన్నారు రాబోయే స్థానిక ఎన్నికల్లో మాదిగ వాడ సత్తా ఏందో చూపిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు ఒకపక్క మాజీ ఎంపీపీ మరోపక్క కొండమల్లేపల్లి సీసీ బ్యాంక్ చైర్మన్ వీరిద్దరు కలసి మాదిగలపై కపట ప్రేమ చూపుతూ కాలమెల్లపుచ్చుతున్నారు దీనిపై







ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో మాదిగలంతా ఏకమై స్థానిక ఎన్నికల్లో మన సత్తా ఏందో చూపాలని తీర్మానం చేసుకోవడం జరిగినది శనివారం నాడు చింతకుంట గ్రామపంచాయతీ కార్యదర్శి తోపాటు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వాడ వాడ తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకొని మాదిగలకు న్యాయం చేయాలని కార్యదర్శని కోరినారు వెంటనే కార్యదర్శి పై అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పడం జరిగినది . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పంది శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ చింతకుంట గ్రామ శాఖ అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్ పంది అంజయ్య పంది అనిల్ పంది రామస్వామి ఏదుల బిక్షమయ్య మారుపాక రాములు పంది యాదయ్య పంది లక్ష్మయ్య పంది చంద్రయ్య ఎదుల నాగయ్య నల్ల ఆదాం ఎదుల వెంకటయ్య ఎదుల శీను పంది ముత్యాలు పంది నాగేష్ ఎదుల అమరేందర్ అందుగుల బజార్
మరియు ఎంఆర్పిఎస్ కార్యకర్తలు గ్రామ పెద్దలు మాదిగవాడ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ రక్షణ కోసం.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జూలై 9న దేశవ్యాప్త సమ్మె

**నల్లగొండ,జూన్ 28(వార్త వేదిక సూర్య):** ఉపాధి హామీ రక్షణ కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జూలై 9న దేశవ్యాప్త సమ్మె , గ్రామీణ బంద్ ను జయప్రదం చేయండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ కోసం, నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జులై 9న దేశవ్యాప్త సమ్మె , గ్రామీణ బంద్ కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు, రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అవుట సైదులు పిలుపునిచ్చారు. శనివారం హాలియా మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో, వ్యవసాయ రంగంలో తిరోగమన సంస్కరణలు, విధానాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీని ఎత్తివేయాలని కుట్రలను చేస్తూ అనేక కొత్త కొత్త జీవోలను తెస్తూ కార్మికుల బతుకులతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతి బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు తగ్గించడం ఎట్లా కరెక్ట్ అని



ప్రశ్నించారు. రాష్ట్రంలో 1.10 కోట్ల మంది పైగా ఉపాధి హామీ కూలీలు ఉంటే అందులో 54.85 లక్షల మంది ఉపాధి హామీలో పని చేస్తున్నారని వారికి ఈ సంవత్సరము 12 కోట్ల పని దినాలు అవసరం ఉంటే కేంద్ర ప్రభుత్వము కేవలము 6.5 కోట్ల పని దినాలను మాత్రమే అనుమతించిందని అన్నారు. పెద్ద ఎత్తున కూలీల సంఖ్య పెరిగి పని దినాల డిమాండ్ పెరిగిన పరిస్థితులలో పని దినాలు పెంచేది పోయి ఎట్లా తగ్గిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీకి 2.5 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని, ఆధారిత చెల్లింపును నిలిపివేయాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని, ప్రమాద బీమా సౌకర్యము 10 లక్షలు ఇవ్వాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్ తో నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, సమ్మెను పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జటావత్ రవి నాయక్ , కమిటీ సభ్యులు వెంకన్న జిల్లా నాయకులు మెగావత్ రాములు, జాను, తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




## కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు

**మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉబ్బు వెంకటయ్య గౌడ్**

**చౌటుప్పల్, జూన్ 28 (వార్త వేదిక సూర్య):** ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి విఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉప్పు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలిపలువురు నాయకులను పార్టీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఎలవర్తి యాదగిరి బిఆరస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఈద్దుల మస్తాన్ బాబు యాదవ్ ప్రధాన కార్యదర్శి



మహంకాళి పృథ్వి,మాజీ వార్డు మెంబర్ మహంకాళి కృష్ణ, బిఆర్ ఎస్ సీనీయర్ నాయకులు ఈద్దుల శ్రీశైలం,బోయిన వేంకటేష్,రవి,బాబు, కేశవ్, సైదులు, నర్సింహ్మా, చిట్టంపల్లి చంద్రశేఖర్,చింతపట్ల జగన్, నర్సింహ,భాస్కర్,లింగస్వామి, సురేష్ చారి, భూపాల్,రమేష్,అరుణ్, సంతోష్,భాస్కర్,గణేశ్,కార్తిక్,ఎస్ మహేష్,ఎం నవీన్,అర్జున్,నవీన్,విక్కీ,సురేష్, అంజయ్య తదితరులు ఉన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి ,మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్ ,మాజీ మున్సిపాలిటీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు %ు%వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్ , మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్ మరియు మాజీ ఎంపిటిసి చిట్టంపల్లి శ్రీనివాస్ మరియు గ్రామ శాఖ అధ్యక్షులు మునుకుంట్ల రాజు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనారు

## చిన్నకొండూర్ శివకుమార్‌కు డాక్టరేట్

**చౌటుప్పల్, జూన్ 28 (వార్త వేదిక సూర్య):**

చౌటుప్పల్ మండలంలోని చిన్నకొండూరు గ్రామానికి చెందిన కానుకుర్తి నర్మద – శంకర్ దంపతుల చిన్న కుమారుడు కానుకుర్తి శివకుమార్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ రాజనీతిశాస్త్ర విభాగంలో పరిశోధనలు జరిపి పిహెచ్‌డి పట్టాను సాధించారు. డాక్టర్ యాస్మిన్ పర్యవేక్షణలో



దేశంలో జరుగుతున్న వైట్ కాలర్ నేరాలు, సైబర్ క్రైమ్ పై పరిశోధనలు జరిపి శివకుమార్ డాక్టరేట్‌ను పొందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ శివకుమార్ ను అభినందించారు.

## సాగు చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి

**రైతుల సంక్షేమ రాష్ట్ర చైర్మన్ కోదండ రెడ్డి**

**చౌటుప్పల్, జూన్ 28 (వార్త వేదిక సూర్య):**

సాగు చట్టాల పై రైతులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఎం కోదండ రెడ్డి తెలిపారు. వ్యవసాయం చేయడంలో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని, రైతులకు వ్యవసాయ చట్టాలను చుట్టాలని చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ కమిషన్, లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లిలో చేపట్టిన సాగున్యాయయాత్ర శనివారం మధ్యాహ్నం చౌటుప్పల్‌కు చేరుకుంది. రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించటం, రైతుల న్యాయ అవసరాలపై అధ్యయనం చేయటం కోసం చేసే సాగు న్యాయ యాత్ర చౌటుప్పల్ కు చేరుకున్న సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద సాగు చట్టాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న రైతుల సంక్షేమం, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు భూమి సునీల్ లు మాట్లాడుతూ దుక్కి దున్నే



నాటి నుండి పండించిన పంటను మార్కెట్లో అమ్ముకునే వరకు రైతులు ఎదుర్కొనే సమస్యలు, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల నష్టం వాటిల్లినపుడు, మార్కెట్ మోసాలు జరిగినపుడు, పంట బీమా అందనపుడు వంటి అవసరం అయ్యే చట్టాల గురించి రైతులకు వివరించారు. తద్వారా సాగు ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు పొందేలా రైతులకు సూచనలు, యూరియా ని తక్కువగా వాడటం, ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు రషీదులని తీసుకొని పంటకాలం పూర్తి అయ్యే వరకు భద్ర పరచుకోవటం వంటి విషయాలను గుర్తు చేసారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ కొందరు రైతులకు రెండు లక్షల రుణాల లోపు మాఫీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలవల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ జరగకుండా ఆగిపోయిన రైతులకు కూడా రుణమాఫీ చేసి ఆదుకోవాలని కమిటీనీ కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మెట్ట భూమి ఎక్కువగా ఉందని, సాగు నీరు లేని కారణంగా సాగు. తక్కువగా ఉందని, నీటి సదుపాయం కల్పించినట్లయితే సాగు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, భువనగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి వెంకటేశ్వర్లు, వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ రఘుమారెడ్డి, మార్కెట్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పి ఎ సి ఎస్ డైరెక్టర్లు, సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# చండూరు మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి యాక్షన్ ప్లాన్

- చండూరు మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌పై మునుగోడు క్యాంపు కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా చండూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలి
- చండూరు మున్సిపాలిటీపై జరిగిన సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, జూన్ 28 (వార్త వేదిక సూర్య):**

చండూరు మున్సిపాలిటీని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకుంటూ అభివృద్ధి పరచుకోవాల్సిన అవసరం ఉందని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు శనివారం మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో చండూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశం నిర్వహించారు చండూరు మాస్టర్ ప్లాన్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు హైదరాబాదుకు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్ర ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, కూడళ్ళ నిర్మాణం, వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, నూతన మున్సిపాలిటీ పరిపాలన భవనం, పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మాణాలపై యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు...

చండూరు రెవిన్యూ డివిజన్ గా మారిన తర్వాత భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని వారికి సరిపడా మౌలిక వసతులను కల్పించాలని నిర్ణయించారు. ప్రధానంగా డ్రైనేజ్ సిస్టంపై లోతుగా అధ్యయనం చేసి దానికనుగుణంగా మాస్టర్ ప్లాన్ రెడీ చేశారు. ఈ యాక్షన్ ప్లాన్‌ను రానున్న మూడు ఆర్థిక సంవత్సరాలలో విడతల వారీగా అభివృద్ధి చేసుకోవాలని. ఈ అభివృద్ధికి సంబంధించిన నిధులను ప్రభుత్వంతో మాట్లాడి తీసుకొచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు..

ఈ సమీక్ష సమావేశం లో హైదరాబాద్ కు చెందిన మాస్టర్ ప్లాన్ సీనియర్ కన్సల్టెంట్ సుభాని, ఉమ్మడి నల్గొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వరరావు, డి ఈ మనోరమ, ఏఈ నాగ ప్రసాద్, విద్యుత్ ఏఈ గణేష్, చండూరు పట్టణ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరగాలి

- శరవేగంగా విస్తరిస్తున్న చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై మునుగోడు క్యాంపు కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 31263, ప్రస్తుతం లక్షకు పైనే, రాబోయే రోజుల్లో జనాభా ఇంకా పెరుగుతుంది
- 2011 లెక్కల ప్రకారమే ఇప్పటికి తాగునీటి కేటాయింపులు
- భవిషత్తులో శివన్న గూడెం రిజర్వాయర్ నుండి చౌటుప్పల్ పట్టణానికి తాగునీరు అందించేలా డిపిఆర్ సిద్ధం చేస్తున్నాం
- రాబోయే 30 సంవత్సరాలకు సరిపడా శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు రూపొందించాలి
- చౌటుప్పల్ మున్సిపాలిటిపై జరిగిన సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు, జూన్ 28 (వార్త వేదిక సూర్య):**

చౌటుప్పల్ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరగాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు శనివారం మునుగోడు లోనికి క్యాంపు కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవడానికి అవసరమయ్యే మాస్టర్ ప్లాన్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు హైదరాబాద్ కు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన స్టేటస్ను అధికారులను అడిగి తెలుసుకున్నారు . అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, వాన నీటి కాలువలు, మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్లు, పార్కుల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, నూతన మున్సిపల్ పరిపాలన భవనము, షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్మాణాల అభివృద్ధి తో పాటు సమగ్ర అభివృద్ధి పై ఫోకస్ పెట్టామన్నారు. వర్షాకాలంలో లక్కారం చెరువు నుండి వచ్చే వర్షపు వరద నీటి మళ్లింపు ఎటువైపు చేపట్టాలనే అంశంపై స్థానిక నాయకులు పలు సూచనలు చేశారు... 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించిన తాగునీటి కేటాయింపుల ప్రకారం మాత్రమే ఇప్పటికీ తాగునీరు వస్తుందని.. కానీ ఇటీవల గుణాత్మకంగా జనాభా పెరగడంతో ఆ త్రాగునీరు సరిపోవడంలేదని ఎమ్మెల్యే దృష్టికి



స్థానికనాయకులు తీసుకొచ్చారు. ప్రస్తుతం లక్ష జనాభా నివసిస్తున్న చౌటుప్పల్ పట్టణానికి, అదేవిధంగా మరో 30 సంవత్సరాల భవిష్యత్తుకు సరిపడే విధంగా త్రాగునీరు అందించడానికి శివన్న గూడెం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకురావడానికి డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని రాజ్ గోపాల్ రెడ్డి తెలిపారు...

రాబోయే కాలంలో చౌటుప్పల్ జనాభా 5 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉందని, ఒకవైపు ఇండస్ట్రియల్ పార్కు పూర్తయితే వేలాదిమంది ఉపాధి కోసం చౌటుప్పల్ కు వస్తారని, హైదరాబాద్కు దగ్గర ప్రాంతం కావడంతో ఎక్కువ సంఖ్యలో చౌటుప్పల్ ప్రాంతంలో నివాసం ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎంత జనాభా పెరిగినా కూడా ఆ జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన ఉండేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు..

ప్రస్తుతం జీవన ప్రమాణాలు పెరిగిపోతున్నాయని పెరుగుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగానే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న లక్కారం చెరువు, ఊర చెరువు నాగులకుంట చెరువులకు వచ్చే మురుగునీరుని బైపాస్ చేసి ఆ చెరువుల్లో వర్షపు నీరు నిలిచేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. చెరువులను సుందరీకరించు కోవడం వల్ల పట్టణంలో నివసించే కుటుంబాలు ఆహ్లాదకరంగా గడపడానికి వీలుంటుందన్నారు...

ఈ సమీక్ష సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వరరావు, డి ఈ మనోరమ, చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







# విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలి

**చౌటుప్పల్ హైస్కూల్లో మ**
**మధ్యాహ్న భోజన పథకం ఆకస్మిక తనిఖీ**

**యాదాద్రి భువనగిరి రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి**

**చౌటుప్పల్, జూన్ 28 (వార్త వేదిక సూర్య):** పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, మంచి రుచికరమైన భోజనం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని, వంటశాలను పరిశీలించారు, విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉందని విద్యార్థిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న మంచినీటి ఆర్ ఓ ప్లాంట్ ను పరిశీలించారు. స్వచ్ఛమైన మంచినీటిని మాత్రమే వాడాలన్నారు. మెనూ ప్రకారం పాఠశాలలో మంచి రుచికరమైన భోజనం అందిచాలని, పాఠశాల పరిసరాలను, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రపరచి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ, ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, మండల విద్యాధికారి ఇ గురువారావు తదితర అధికారులు ఉన్నారు.

# బస్వాపురం రిజర్వాయర్ నుండి గోదావరి జలాలను సాగు త్రాగునీరుకై పిల్లాయిపల్లి కాలువలోకి తక్షణం నీటిని విడుదల చేసి రైతులకు ప్రజలకు త్రాగు సాగునీరు అందించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి**
**మండల కార్యదర్శి గంగాదేవి సైదులు డిమాండ్ చేశారు**

**చౌటుప్పల్, జూన్ 28 (వార్త వేదిక సూర్య):**

పిల్లాయిపల్లి కాలువలోకి వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు ప్రజలకు త్రాగు సాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి గంగాదేవి సైదులు గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.

శనివారము చౌటుప్పల మండల కార్యదర్శి వర్గ సమావేశం కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి గారు పాల్గొని మాట్లాడుతూ , చౌటుప్పల, మండలంలోని రైతాంగానికి కీలకంగా త్రాగు సాగుకు ఉపయోగపడుతున్న పిలాయిపల్లి కాలువ మరమ్మతులు




వెడల్పు,లోతు కోసం నీటిని బందు చేసి నెల రోజులలో పూర్తి చేసి సాగు నీటిని విడుదల చేసి ఇస్తామని చెప్పి నిర్లక్ష్యం చేస్తున్న ఇరిగేషన్ అధికారులు అని ప్రశ్నించారు..? ఇప్పటికే అనేకమంది రైతులు నార్లు పోసుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారని, నారు ముదిరిపోయే ప్రమాదం ఉంది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాల్వ పనులు పూర్తిచేసి తక్షణం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతాంగాన్ని సమీకరించి ఆందోళన చేపడుతామని కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వము అందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పి కొందరికే ఇవ్వడం ఎట్లా కరెక్టని ప్రశ్నించారు. ఇప్పటికైనా గ్రామాలలో అర్హత ఉండి దరఖాస్తు చేసుకొన్న ప్రతి ఒక్కరికి రాజకీయాల కతీతంగా ఇందిరమ్మ ఇండ్లను భూమాతలో వచ్చిన రెవిన్యూ భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వికలాంగులకు 6000 పింఛను వృద్ధులకు 4000 పిచ్చలు ఇవ్వాలని అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కృష్ణారెడ్డి కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి బొజ్జ బాలయ్య చింతల సుదర్శన్ బోయ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
29, జూన్ 2025


# 40 రోజుల ఎక్స్‌టెన్సివ్ షెడ్యూల్‌లో 'ది పారడైజ్'



నేచురల్ స్టార్ నాని తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్'లో అడుగుపెట్టారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఎస్ఎల్‌వి సినిమాస్ సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం కోసం మరోసారి చేతులు కలిశారు. జూన్ 21న షూటింగ్ ప్రారంభమైంది. నాని ఈరోజు సెట్స్‌లో అడుగుపెట్టారు. వారం పాటు సాగిన కీలకమైన చైల్డ్ వుడ్ సన్నివేశాల షూటింగ్ తో సినిమా జర్నీ ప్రారంభమైంది. ఇప్పుడు నాని ఎంట్రీ ఇచ్చారు. "ధగడ్ ఆగయా!" అంటూ అమెజింగ్ అనౌన్స్‌మెంట్‌తో లుక్ రిలీజ్ చేశారు. బరువైన బార్బెల్ వెయిట్స్‌పై నాని కాలు మాత్రమే కనిపించే పోస్టర్‌లో 'ఈసారి నాని మరింత ఫెరోషియస్ వస్తున్నాడు'అనే క్యాప్షన్ ఆకట్టుకుంది. ఈ 40 రోజుల హైదరాబాద్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంతో కూడిన పవర్‌ఫుల్ సన్నివేశాలు షూట్ చేయనున్నారు.


ప్రత్యేకంగా డిజైన్ చేసిన గ్రాండ్ సెట్స్‌లో షూటింగ్ జరగనుంది. 'దసరా' సినిమా పాన్ ఇండియా అదరగొట్టింది. 'ది పారడైజ్' గ్లోబల్ లెవెల్‌కు వెళ్లబోతోంది. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ 8 భాషలలో విడుదల కానుంది. టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా గ్లింప్స్‌లో ఉన్న పవర్‌ఫుల్ డైలాగ్, విజువల్స్, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్, నాని స్ట్రాంగ్ ఎంట్రీ... ఇవన్నీ సినిమా పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి.



# మహేష్ సినిమాలో ప్రత్యేక నృత్యం

ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా ఎస్ ఎస్ ఎంబీ 29 పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. దీనిలో భాగంగా హైదరాబాద్, ఒడిశా ప్రాంతాల్లో కీలక షెడ్యూల్స్ పూర్తి చేసారు. ఇందులో మహష్, పృధ్వీరాజ్ సుకుమార్, ప్రియాంక చోప్రా సహప్రధాన తారాగణపైం కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ప్రత్యేకంగా రెండవ షెడ్యూల్ చాలా రోజుల పాటు ఒడిశా హిల్స్ పై జరిగిన సంగతి తెలిసిందే. ఇక్కడ నుంచే మహేష్ లుక్ సహా కొన్ని సన్నివేశాలు లీకింగ్ జరిగింది. తాజాగా ఈసినిమా గురించి మరో ఇంట్రెస్టింగ్ విషయం తెలిసింది. ఈ సినిమా కోసం ప్రియాంక చోప్రా ప్రత్యేకంగా మయూర్ భంజ్ ఛౌ అనే నృత్యాన్ని నేర్చుకుంది. ఈ నృత్యంలో ప్రసిద్ది చెందిన ఒడిశా కళాకారుడు విక్కీ భర్తయ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంది పీసీ. ఈ సందర్భంగా పీసీ తో ఉన్న అనుబంధాన్ని భర్తయా గుర్తు చేసుకున్నాడు. 'ప్రియాంక చోప్రాతో పనిచేయడం నిజంగా గొప్ప అనుభవం. ఆమె ఎంతో తెలివైంది. చాలా సరదాగా ఉంటుంది. తాను పెద్ద హీరోయిన్ అన్న భావన ఎక్కడా చూపించరు. డాన్సు రిహార్సల్స్ సమయంలో ఆమె లో ఎనర్జీ స్ఫూర్తిదాయం. ఈ ప్రయాణంలో నేను భాగమవ్వడం సంతోషంగా భావిస్తున్నా%-% అన్నారు. మయూరు భం ఛౌ అన్నది ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకమైన కళ. ఇందులో మూడు విభిన్న శైలిలు ఉంటాయి. ఇది మయూరు భౌంజ్ చౌ జిల్లాలో ప్రసిద్ది చెందింది. ఇదొక సెమీ క్లాసికల్ నృత్య రూపం. ఇతర నృత్యాల కంటే భిన్నంగా ఉంటుంది.

# సందీప్ రెడ్డి వంగా లాంచ్ చేసిన 'జిగ్రీస్' ఫస్ట్ లుక్



కృష్ణ బురుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ ఓ యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్‌ని నిర్మిస్తోంది. హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈ చిత్రానికి "జిగ్రీస్" అనే క్రేజీ టైటిల్ ఖరారు చేశారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా జిగ్రీస్ టైటిల్, ఫస్ట్ లుక్‌ని లాంచ్ చేసి టీంకి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఒక వింటేజ్ మారుతీ 800 కారు పక్కన నిలబడ్డ నలుగురు ఫ్రెండ్స్‌ని పై నుంచి చూపించడం ఇంట్రస్టింగ్‌గా ఉంది. బోల్డ్ ఆరెంజ్ బ్యాక్‌డ్రాప్, గ్రిట్టీ టైటిల్ టైపోగ్రఫీ... సినిమా ఎంత అడ్వెంచరస్‌గా ఉండబోతోందో తెలియజేస్తోంది. ఈ ఫస్ట్ లుక్, టైటిల్ సోషల్ మీడియాలో మంచి బజ్ క్రియేట్ చేసింది. జిగ్రీస్ చైల్డ్‌హుడ్ ఫ్రెండ్షిప్, నాస్టాల్జియా, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్. త్వరలోనే సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు మేకర్స్ తెలియజేస్తారు.

# 3BHK హార్ట్ టచ్చింగ్ ట్రైలర్ లాంచ్

హీరో సిద్ధార్థ్ 40వ మూవీ '3 BHK. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. పోస్టర్లు, టీజర్లు, పాటలతో సినిమా మంచి బజ్ క్రియేట్ చేసింది. ప్రముఖ నటుడు శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తుండగా, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.




శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించిన ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. ఇల్లు సొంతం చేసుకోవాలనే జీవితకాల కల కలిగిన మధ్యతరగతి కుటుంబ భావోద్వేగ ప్రయాణంలో ఈ ట్రైలర్ మనసుని హత్తుకుంది. జీవితంలో వైఫల్యాలు, నిరాశలను ఎదుర్కొన్న తండ్రి, కుటుంబం ఆకాంక్షలను నెరవేర్చడానికి తన కొడుకుపై తన ఆశలన్నింటినీ ఉంచుతాడు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ... 3 బీహెచ్‌కే మూవీ ఫ్యామిలీని మీకు పరిచయం చేయాలి. అరుణ్ విశ్వా ఎక్సైటింగ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ఒక రియల్ లైఫ్ నుంచి వచ్చిన కథ. ఈ సినిమా చూసిన తర్వాత వెంటనే మా నాన్నని గట్టిగా హగ్ చేసుకోవాలని అనిపించింది. తండ్రి కొడుకుల రిలేషన్షిప్ ని బొమ్మరిల్లు సినిమాల్లో చూశారు. ఆ సినిమా నాకు చాలా నేర్పించింది. అలాంటి సినిమా తర్వాత మళ్ళీ తండ్రి కొడుకుల రిలేషన్షిప్ 3 బీహెచ్‌కే లో చూస్తారు. ఈ సినిమా చూసినప్పుడు నాకు ఎలాంటి అనుభూతి కలిగిందో మీకు కూడా ఆ అనుభూతి కలుగుతుందని భావిస్తున్నాను. మీ ఫ్యామిలీని తీసుకుని థియేటర్స్ కి వెళ్ళండి. వాళ్ళని హగ్ చేసుకోవడానికి మీ పక్కనే ఉంటారు. శ్రీ గణేష్ ఎక్స్‌ట్రార్డినరీ రైటర్ డైరెక్టర్. తను ఈ కథ చెప్పినప్పుడే చాలా ఎమోషనల్ గా అనిపించింది. సొంత ఇల్లు అందరి కల. నేను కూడా చిన్నప్పుడు మా సొంతిల్లు కోసం ఎదురు చూశాను. మనందరం అలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ నుంచే వచ్చాము. ఈ సినిమాలో మెయిన్ క్యారెక్టర్ ఇల్లు. అందులో మెయిన్ క్యారెక్టర్స్ శరత్ కుమార్ గారు దేవయాని గారు. వాళ్లు ఈ సినిమాలో నటించడం మర్చిపోలేని అదృష్టం. ఇది నా 40వ సినిమా. అలాంటి సినిమాలో ఇంత మంచి యాక్టర్స్ ఉండటం నా అదృష్టం. నా వాల్యూని తెలుగు ప్రేక్షకులే మొదటి చూశారు. ఎప్పుడు కూడా వారే గొప్ప ప్రేమని చూపించా.రు అది ఎప్పటికి మారదు. మారకూడదు. ఇది ఒక బ్యూటిఫుల్ ఫ్యామిలీ స్టోరీ. సినిమాని రిలీజ్ చేస్తున్న మైత్రి డిస్ట్రిబ్యూషన్ వారికి ధన్యవాదాలు. జూలై 4న తప్పకుండా మీరందరూ ఆ ఎమోషన్ ని ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. మీ అందరి ప్రేమకి థాంక్యూ'అన్నారు.

# శ్రీయ హొయలు

సినిమా రంగంలో తన నటనతో ఎంతగానో మెప్పించిన శ్రియా శరణ్... ఇప్పుడు ఫ్యాషన్ రంగంలోనూ అదరగొడుతోంది. ఇటీవల ప్రముఖ డిజైనర్ లేబుల్ కోసం ఆమె చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మాలిబులో గార్డెన్ ఆఫ్ ఈడెన్ కలెక్షన్‌కి చెందిన ప్యాస్టెల్ బ్లూ కలర్ లెహంగా లుక్‌లో ఆమె ఎటువంటి సందేహాలకూ తావు లేకుండా గ్లామర్‌కు కొత్త నిర్వచనం ఇచ్చింది. మృదువైన రంగులు, ఆకర్షించే డిజైన్, శ్రియా నడుమున మెరిసే ఆ హావభావాలు... అన్నీ కలగలిపి ఈ లుక్‌ను అద్భుతంగా మార్చేశాయి. ఈ లుక్‌లో కనిపించిన శ్రియా లెహంగా లైట్ బ్లూ షేడ్స్‌తో నాజూకుగా ఉంది. మెరుస్తున్న బ్లౌజు డిజైన్, మ్యాచ్ అయిన స్కర్ట్‌పై ఉన్న నాజూకు పువ్వుల ఎంబ్రాయిడరీ... ఆమెను ఒక ఫెయిరీటేల్ ప్రిన్సెస్‌లా చూపించింది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న జుమ్కాలు, మృదువైన హెయిర్‌స్టైల్ మరింత అందాన్ని జోడించాయి. సోషల్ మీడియాలో ఈ లుక్‌కి అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. శ్రియా శరణ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె దక్షిణాది సినీ ఇండస్ట్రీలోనే కాదు, బాలీవుడ్‌లోను తన ప్రత్యేకతను చాటుకుంది. 'శివాజీ'లో రజనీకాంత్‌కు జోడిగా, 'గౌతమిపుత్ర శాతకర్ణి'లో బాలకృష్ణ సరసన, అలాగే హిందీలో 'దృశ్యం' సిరీస్‌లో అజయ్ దేవగన్‌కి భార్యగా ఆకట్టుకున్నారు. ఇటీవలి కాలంలోనూ ఆమె '%===%' వంటి పాన్ ఇండియా ప్రాజెక్టుల్లోనూ కనిపిస్తూ, స్టార్డమ్‌ను కొనసాగిస్తూ వస్తోంది. తన కెరీర్‌కి తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్నా కూడా, శ్రియా సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండి... ప్రతి లుక్‌తోనూ ట్రెండ్ సెట్ చేస్తోంది. ఆమె గ్లామర్‌ను చూస్తే వయస్సు కేవలం ఒక నెంబర్ అనిపిస్తుంది. ఈ ఫోటోషూట్‌లోనూ ఆమె కామ్బినేషన్ ఫియర్‌లెస్ ఫ్యాషన్‌ను స్పష్టంగా చూపించింది. ప్రస్తుతం శ్రియా కొన్ని తమిళ, హిందీ సినిమాల్లో నటిస్తోంది. మరోవైపు యాడ్స్, ఫ్యాషన్ ఫోటోషూట్‌లతోనూ బిజీగా ఉంది.





'విరాటపాలెం' విజయమే

# అన్నింటికీ సమాధానం

తెలుగులో విజయవంతమైన ఒరిజినల్ షోలు, చిత్రాలతో ఆకట్టుకునే జీ5 ఇప్పుడు 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్' అనే ఇంట్రెస్టింగ్ సిరీస్‌తో అలరిస్తోంది. సోషల్ మీడియా సెన్సేషన్ అభిజ్ఞ వూతలూరు ప్రధాన పాత్రలో నటించిన 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్' సిరీస్‌కు పోలూరు కృష్ణ దర్శకత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బ్యానర్‌పై కె.వ. శ్రీరామ్ ఈ సిరీస్‌ను నిర్మించారు. ఈ సిరీస్ జూన్ 27 నుంచి జీ5లో టాప్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ క్రమంలో టీం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో..నిర్మాత శ్రీరామ్ మాట్లాడుతూ .. "రెక్కీ'తో మేం సక్సెస్ సాధించాం. రెక్కీతోనే నేను వెబ్ సిరీస్‌లు నిర్మించడం ప్రారంభించాను. నాకు జీ5లో ఇంత మంచి అవకాశం ఇచ్చిన అను మేడంకు థాంక్స్. ఆమె ఇచ్చిన సహకారంతోనే ఇవన్నీ చేయగలుగుతున్నాం. 'రెక్కీ' తరువాత ఎన్నో కథలు వింటే 'విరాటపాలెం' పాయింట్ నన్ను హంట్ చేసింది. 'రెక్కీ' చాలా కొత్తగా ఉంటుందని, అందరికీ నచ్చుతుందని ప్రమోషన్స్‌లో చెప్పాం. ఇప్పుడే అదే జరుగుతోంది. 'విరాటపాలెం'ను ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మేం ఇక్కడ ఎవ్వరి గురించి మాట్లాడటానికి రాలేదు. మా మాటలే కంటే మా విజయమే అన్నింటికీ సమాధానం చెబుతుంది' అని అన్నారు. కథా రచయిత్రి దివ్య తేజస్వీ మాట్లాడుతూ .. "విరాటపాలెం' సిరీస్‌ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కు థాంక్స్. విక్రమ్ చెప్పినట్టుగా మాకు అనురాధ మేడం, దేశ్ రాజ్ గారు వెన్నంటే నిలిచారు. జీ5 నాకు ఇంత మంచి ఫ్లాట్ ఫాంను ఇచ్చింది. మా మీద లేనిపోని ఆరోపణలు చేయకండి. కాపీ రైట్ చట్టం మాకు తెలుసు. కొత్త పాయింట్ చెప్పాలనే ఆరాటం మాకు ఉంటుంది. పోలీస్ కథలు కొన్ని వందలు ఉంటాయి.. ఊర్లో జరిగే కథలు ఎన్నో ఉంటాయి. ఓ వ్యక్తి తొందరపడి ఉంటుంది.. కానీ ఎంతో పేరున్న సంస్థ ఆలోచించి మాట్లాడితే బాగుండేది. మేం దీనిపై మాట్లాడాలని అనుకోవడం లేదు. మా విజయమే అన్నింటికీ సమాధానాలు చెబుతుంది. మా సిరీస్‌కు, వాళ్ల సిరీస్‌కు ఒక్క సీన్ కూడా కామన్‌గా ఉండదు. ఇలాంటి ఆరోపణలు నా మీద వచ్చినప్పుడు చాలా బాధపడ్డాను. ఏదైనా సరే నేను చిరునవ్వుతోనే ఎదుర్కొంటాను' అని అన్నారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**